ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
బాపట్ల జిల్లా వార్తలు
5
గురువారం 5 సెప్టెంబరు 2024





● అరవింద వారధిపై చేరిన చెత్తను ఎత్తిపోస్తున్న ఎక్స్‌కవేటర్

నష్టం.. కష్టం

వర్షాలు, వరదలతో **బీభత్సం**

నీటిలో నానుతున్న పంట పొలాలు

దిక్కుతోచని స్థితిలో రైతులు కన్నీటి పర్యంతం

లంక గ్రామాల్లో సర్వం కోల్పోయిన కుటుంబాలు

వరద ఉధృతికి కొట్టుకుపోయిన రోడ్లు, ట్రక్కులు, గోడలు



రేపల్లె : పల్లెపాలెంలో బురదమయమైన ఇంట్లో వస్తువులను శుభ్రం చేసుకుంటున్న మహిళలు

వరుణుడు విరామం తీసుకున్నాడు. కృష్ణమ్మ కరుణించింది. వర్షాలు, వరదల బీభత్సం బుధవారం నుంచి బయటపడుతుంది. కృష్ణా నదీ పరివాహక ప్రాంతం గ్రామాలు, లంకల్లో ఎవరిని కదిపినా కన్నీటి సంద్రమే. పంటలు కోల్పోయి కొందరు.. వ్యవసాయసామగ్రి గల్లంతై మరికొందరు.. మూగజీవాలు కనిపించక పలువురు.. ఇళ్లకు నష్టం వాటిల్లి కొందరు.. ఇలా ఎక్కడ చూసినా వరద బీభత్స బాధితులు కనిపిస్తున్నారు. ఎటు చూసినా నీరు.. కళ్లల్లో కన్నీటి వరద.. సర్వం కోల్పోయి కట్టుబట్టలతో మిగిలిన స్థితి పలువురిది. కృష్ణమ్మ మహోగ్రంతో గొడ్డు, గోద, పొలం, పుట్ర ఏదీ అక్కరకు రాకుండా పోయిందని లంకలు, పరివాహక గ్రామాల్లోని ప్రజలు కన్నీటి పర్యంత మవుతున్నారు. వరద తగ్గుముఖం పట్టడంతో పంటలకు, ఆస్తులకు ఏరీతిలో.. ఎంతమేర నష్టం వాటిల్లిందో బాధితులు చూసుకుంటున్నారు. ఇక ఉమ్మడి గుంటూరు జిల్లావ్యాప్తంగా అధికారులు నష్టం అంచనాల్లో నిమగ్నమయ్యారు. పంటల నష్టం లెక్కించేందుకు వ్యవసాయ, ఉద్యానశాఖలు ప్రత్యేక బృందాలను నియమించాయి. ప్రాథమిక అంచనాల్లోనే వేల ఎకరాలు ఉండటంతో వర్షాలు, వరద బీభత్స నష్టం అపారమని తెలుస్తోంది.

తెనాలి, బాపట్ల(ఆంధ్రజ్యోతి), కొల్లూరు, కొల్లిపర, సెప్టెంబరు 4: కృష్ణమ్మ ప్రకోపానికి నదీపరివాహక గ్రామాలు, లంకలు విలవిలలాడిపోయాయి. ప్రకాశం బ్యారేజి నుంచి రికార్డు స్థాయిలో నీటి ప్రవాహంతో వర్షం వరదగా మారి పొలాలను కబళించింది. కొల్లూరు, భట్టిప్రోలు, చుండూరు మండలాల పరిధిలో ఉద్యాన పంటలతో పాటు వరి కూడా పూర్తిగా నీట మునిగింది. బ్యారేజీకి ఎగువున భారీ వర్షాలు, కృష్ణానదికి వరదతో పల్నాడు ప్రాంతంలో కూడా చాలావరకు పంటలకు అపార నష్టం వాటిల్లింది. మూడు రోజులుగా నీటిలోనే పంటలు నానిపోయాయి. పత్తి, కంది తదితర పంటలకు తీవ్రంగా నష్టం జరిగినట్లు రైతులు తెలిపారు. పంటలతో పాటు పలువురు ఆస్తులు కూడా నష్టపోయారు. లంక గ్రామాల్లో గృహాలు, ప్రభుత్వ ఆస్తులు దెబ్బతినగా వాణిజ్య పంటలు కూడ తుడిసి పెట్టుకుపోయాయి. కృష్ణమ్మ వరద ఉధృతికి రేకుల షెడ్లు, పూరిళ్లు కూలిపోగా ప్రహరీలు పడిపోయాయి. ట్రాక్టర్ ట్రక్కులు తిరగబడి దెబ్బతినిపోయాయి. నిల్వ చేసిన ధాన్యం, ఇతర పంట దిగుబడులు చాలాప్రాంతాల్లో తడిసిపోయాయి. లంక గ్రామాల్లో ఉన్న ప్రజా పంపిణీ దుకాణాల్లో ప్రభుత్వం సరఫరా చేసిన రేషన్ బియ్యం కూడా తడిసి పోయింది. కృష్ణమ్మ లంక గ్రామాల ప్రజల జీవితాలను తలకిందులు చేసేసింది. వరదకు ముందు పండించి ఇంటికితెచ్చి దాచుకున్న పంటనూ వదలకుండా ముంచేసింది. నిన్నటి వరకు ప్రాణాలు దక్కితే చాలన్న ఆలోచనతో ఉన్నవారికి చివరకు ఆ ప్రాణం, వంటిపై దుస్తులే మిగిలాయి. మునిగిన ఇళ్లన్నీ బురదమయమై దుర్గంధం వెదచల్లుతుంటే, వాటిలో తలదాచుకోవడానికీ నానా తంటాలు పడాల్సిన దారుణ పరిస్థితి పలు ప్రాంతాల్లో నెలకొంది. ప్రభుత్వం, స్వచ్ఛంద సంస్థలు అందిస్తున్న సాయం తాత్కాలికంగా కడుపు నింపుతుండటంతో కాస్తంత సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నారు. ఎవరిని కదిపినా తీర్చలేని బాధలు, పూడ్చలేని నష్టాలే. కృష్ణా నదీ పరివాహక గ్రామాల్లో వరద తగ్గుముఖం పట్టాక బుధవారం ఇళ్లన్నీ నీటి నుంచి బయటపడ్డాయి. చాలావరకు రహదారులూ కోతపడిపోయి, గండ్లతో నడవడానికి కూడా వీలులేని విధంగా మారి కనిపించాయి. నాలుగు రోజులుగా వరద నీటిలో లంక గ్రామాలన్నీ మునిగిపోయిన సంగతి తెలిసిందే. మూడు రోజుల పాటు ఇళ్లలో తలదాచుకోలేక, డాబాలపైకి ఎక్కినా, కరెంట్ లేక చీకటిలోనే దోమలతో నరకాన్ని అనుభవించామని బాధితులు వాపోయారు. కొల్లూరు మండలం జువ్వలపాలెం, మునగలపల్లిలంక, భట్టిప్రోలు మండలం చింతమోటు, పెసర్లంక, పెదలంక, కృష్ణనగర్, పల్లెపాలెం వంటి గ్రామాలు ఇంకా కొంతమేర వరదలోనే ఉన్నాయి. కొల్లూరు నుంచి లంక గ్రామాలకు వెళ్లే ప్రధాన రహదారి పూర్తిగా కోతపడిపోయి గండ్లమయంగా మారింది. ముఖ్యమంత్రి పర్యటన సమాచారంతో బుధవారం అధికారులు రోడ్లను సరిచేసే పనులు మొదలుపెట్టారు. నది మధ్యలో ఉన్న లంకలకు ఏకైక మార్గమైన అరవింద వారధిపై చెత్త, ముళ్లకంపలు పేరుకుపోయాయి. వరదకు కొట్టుకు వచ్చిన చెత్తా చెదారాలతో పాటు మూగజీవాల కళేబరాలతో అరవింద వారధి నిండిపోయింది. దోనేపూడి నుంచి పోతార్లంక వెళ్లే దారుల పరిస్థితీ దారుణంగా ఉంది. అరటి, కంద, పసుపు, కూరగాయలు, తమలపాకు, బొప్పాయి తదితర పంటలన్నీ పనికిరాకుండా పోయాయి. అరటి తదితర పంటలు దిగుబడి తీసుకునే తరుణంలో వరద కోలుకోలేని దెబ్బతీసిందని రైతులు కన్నీటి పర్యంతమయ్యారు. కొల్లూరు, భట్టిప్రోలు, కొల్లిపర, రేపల్లె మండలాల పరిధిలో 5,200 ఇళ్ల వరకు వరద నీటిలో మునిగిపోయాయి. వీటిలో 3,900 ఇళ్ల వరకు బయటపడితే, భట్టిప్రోలు మండలంలో మిగిలిన ఇళ్లు ఇంకా నీటిలోనే ఉన్నాయి. బయటపడిన ఇళ్లలో సర్వం తడిచి, పనికిరాకుండాపోతే, వారికి బంక మట్టే మిగిలింది. గృహోపకరణాలు, విద్యుత్తు పరికరాలు, ఎలక్ట్రానిక్ పరికరాలు తడిచి పనికిరాకుండా పోయాయి. మూడు రోజులుగా చీకట్లో ప్రజలు అల్లాడిపోయారు. బుధవారం వరద తగ్గగానే పనులు మొదలుపెట్టి 25 గ్రామాల్లో విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు. ప్రాథమిక అంచనా ప్రకారం విద్యుత్ శాఖకు రూ.80 లక్షల వరకు నష్టం వాటిల్లినట్లు సమాచారం.



మోర్తోట ముక్తేశ్వరస్వామి దేవాలయంలో అడుగుమేర తగ్గిన వరద



భట్టిప్రోలు మండలం వెల్లటూరు లంకలో వరద ముంపులోనే పసుపు పైరు



వరద ఉధృతికి దెబ్బతిన్న బొప్పాయి తోట

తగ్గిన ఉధృతి..

నాగార్జునసాగర్ జలాశయం నుంచి నీటి విడుదల ఆగింది. ప్రకాశం బ్యారేజీ నుంచి నీటి విడుదల 4 లక్షలు క్యూసెక్కులకు పరిమితం చేశారు. దీంతో నదిలో వరద ఉధృతి తగ్గుముఖం పట్టింది. మంగళవారం వరకు కృష్ణానది కరకట్టకు అనుకుని ప్రవహించిన నీరు ప్రస్తుతం నదిలో మాత్రమే ప్రవహిస్తుంది. ఎనిమిది అడుగుల మేర వరద ఉధృతి తగ్గింది. నదీ పరివాహక ప్రాంతంలో లంకగ్రామాలకు వెళ్లే రోడ్లు బయటపడ్డాయి. బుధవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు చూస్తే చాలా వరకు వరద తగ్గుముఖం పట్టడంతో పంటలు నీటిలో నుంచి బయటపడుతున్నాయి. కొన్ని చోట్ల పల్లపు ప్రాంతాల్లో మాత్రం పంటలు నీటిలో నానుతున్నాయి.

నేడు లంక గ్రామాలకు చంద్రబాబు

● కొల్లూరు, భట్టిప్రోలు మండలాల్లో సీఎం పర్యటన

వేమూరు: కొల్లూరు, భట్టిప్రోలు మండలాల పరిధిలోని వరద ప్రభావిత లంక గ్రామాల్లో గురువారం ముఖ్యమంత్రి చంద్రబాబు పర్యటించనున్నారు. ముఖ్యమంత్రి పర్యటన బుధవారం ఖరారైంది. దీంతో అధికారులు హుటాహుటిన ఏర్పాట్లు చేస్తున్నారు. వేమూరు మార్కెట్ యార్డు వద్ద నిర్మించిన హెలిప్యాడ్‌కు ప్రత్యేక హెలికాప్టర్ ద్వారా చేరుకుని అక్కడి నుంచి రోడ్డు మార్గాన కొల్లూరు, భట్టిప్రోలు మండలాల పరిధిలోని గ్రామాల్లో చంద్రబాబు పర్యటించనున్నారు. బాధితులను పరామర్శించి దెబ్బతిన్న పంటలను పరిశీలించనున్నారు. అవసరమైతే ముఖ్యమంత్రి బస కోసం వేమూరులోని బాపట్ల పార్లమెంటరీ స్థాయి టీడీపీ అధికార ప్రతినిధి జొన్నలగడ్డ విజయబాబు గృహాన్ని, ఆర్యవైశ్య కల్యాణ మండపాన్ని కలెక్టర్ వెంకటమురళి పరిశీలించారు. చంద్రబాబు రెండు రోజులు వేమూరులో ఉండేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. రేపల్లె ప్రాంతంలో కూడా పర్యటించే ఆలోచనలో సీఎం ఉన్నట్లు సమాచారం. ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లను మంత్రులు అనగాని సత్యప్రసాద్, గొట్టిపాటి రవికుమార్, ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు తదితరులు పరిశీలించారు.



రేపల్లె : బొబ్బర్లంక గ్రామంలో పునరావాస కేంద్రంలో ఉన్న ప్రజల సమస్యలను వింటున్న మంత్రులు అనగాని సత్యప్రసాద్, గొట్టిపాటి రవికుమార్

అధైర్యపడొద్దు.. ఆదుకుంటాం

మంత్రులు అనగాని, గొట్టిపాటి

అధిక వర్షాలు, వరదలకు నష్టపోయిన వారిని అన్ని విధాలా ఆదుకుంటామని మంత్రులు సత్యప్రసాద్, గొట్టిపాటి రవికుమార్ తెలిపారు. కరకట్ట వెంబడి ఉన్న గ్రామాల్లో మంత్రులు బుధవారం పర్యటించి బాధితులకు అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. వైసీపీ ప్రభుత్వం చేసిన తప్పు లే ఇప్పుడు ప్రజలకు శాపంలా మారాయన్నారు. గృహాలు కోల్పోయిన వారికి స్థలాలు ఇచ్చి పక్కా గృహాలు నిర్మించేందుకు కృషి చేస్తామన్నారు. ఆర్థికంగా ఆదుకునే దిశగా ముందుకు వెళ్తామన్నారు. ప్రభుత్వం ప్రజలకు అండగా నిలిచి ఆర్థికంగా ఆదుకుంటుందని తెలిపారు.



ఓలేరు పల్లెపాలెంలో సామగ్రిని శుభ్రం చేస్తున్న తల్లి, కుమారుడు



పెనుమూడి: పల్లెపాలెంలో వరద ఉధృతికి కూలిన ఇంటి గోడలు



పల్లెపాలెంలో ఇంట్లో నీటిని బయటకు ఎత్తిపోస్తూ...



భట్టిప్రోలు : వెల్లటూరు నుంచి లంక గ్రామాలకు వెళుతున్న ప్రజలు



భట్టిప్రోలు : ఇంట్లో నీరును బయటకు ఎత్తిపోస్తూ..



ఆవులవారిపాలెంలో వరదకు తడిసిపోయిన ధాన్యం



కొట్టుకుపోయిన కొల్లూరు - ఆవులవారిపాలెం రహదారి



వరద ఉధృతికి బోల్తా పడి దెబ్బతిన్న ట్రక్కులు



అరవింద వారధిపై పనులను చర్చిస్తున్న ప్రత్యేక అధికారి, కలెక్టర్, ఎమ్మెల్యే ఆనందబాబు

42,000 హెక్టార్లలో మునిగిన వరి

బాపట్ల జిల్లాలో..

బాపట్ల(ఆంధ్రజ్యోతి): బ్యారేజీ నుంచి రికార్డు స్థాయిలో వచ్చిన వరద పొలాలను కబళించింది. కొల్లూరు, భట్టిప్రోలు, చుండూరు మండలాల పరిధిలో ఒక్క ఎకరం కూడా చేతికొచ్చే పరిస్థితి లేదు. వరిలో ఎకరాకు ఇప్పటికే పెట్టుబడి దాదాపు పదివేల వరకు పెట్టిన పెట్టుబడి మొత్తం నష్టపోయినట్లేనని రైతులు తెలిపారు. 45,000 హెక్టార్లలో పైర్లు నీటమునగగా ఇందులో వరి వాటానే 42,000 హెక్టార్లుగా ఉంది. మిగిలిన 3,000 హెక్టార్లలో మినుము, శనగ ఉంది. పంట నష్టపోయిన మండలాల్లో బాపట్లలో అత్యధికంగా 5,850, అమర్తలూరు 4,150, చుండూరు 5,000 చెరుకుపల్లి 4,200, వేమూరు 3,800 హెక్టార్లుగా అంచనా వేశారు. కర్లపాలెంలో 2520, భట్టిప్రోలులో 1,800 రేపల్లెలో 3,000 హెక్టార్లుగా అధికారులు ప్రాథమిక నివేదికలో పొందుపర్చారు. లంక గ్రామాల్లో ఉద్యాన పంటలు 4,614 హెక్టార్లలో నష్టపోయినట్లు సమాచా రం. వరి, ఉద్యాన పంటల నష్టంతో జిల్లాలో 48,000 మంది రైతులు కన్నీటి పర్యంతమవుతున్నారు. వరద పూర్తిగా తగ్గాక ఈ నష్టం అంచనాలు మ రింత పెరిగే అవకాశం ఉందని అన్నదాతలు అభిప్రాయపడుతున్నారు.



ఇంకా ముంపులోనే పెనుమూడి పల్లెపాలెం

33,345 హెక్టార్లలో పంట నష్టం

జిల్లాలో ఏడుగురు జల సమాధి

గుంటూరు జిల్లాలో..

గుంటూరు(ఆంధ్రజ్యోతి): వర్షాలు, వరదల కారణంగా జిల్లాలో 75,153 మంది ప్రజలు ఇబ్బందులు పడ్డారు. 35,345.2 హెక్టార్లలో పంట నష్టం జరిగినట్లు అధికారులు ప్రాథమికంగా అంచనా వేశారు. ఇందులో వ్యవసాయ పంటలు 31,751.2, ఉద్యాన పంటలు 3594 హెక్టార్లలో ఉన్నాయి. 8,116 ఇళ్లు నీట మునిగాయి. ఏడుగురు వరదలో చిక్కుకుని ప్రాణాలు కోల్పోయారు. వరద తగ్గుముఖం పట్టడంతో 10 క్యాంపులను మూసేశారు. ఆర్అండ్‌బీ పరిధిలో 969 కిలో మీటర్లు దెబ్బతినగా 24 చోట్ల గండ్లు పడ్డాయి. తాత్కాలిక మరమ్మతులకు రూ.1,128 లక్షలు, శాశ్వత మరమ్మతులకు రూ.11,315 లక్షల నిధులు అవసరమౌతాయని గుర్తించారు. పంచాయతీరాజ్ శాఖ పరిధిలో దెబ్బతిన్న 113 రోడ్ల తాత్కాలిక మరమ్మతులకు రూ.1,171 లక్షలు, శాశ్వత మరమ్మతులకు రూ.9,098.45 లక్షలు అవసరమని అంచనా వేశారు. నాలుగు మున్సిపాలిటీల పరిధిలో 24.93 కిలోమీటర్ల రోడ్లు, డ్రెయిన్లు 6.395 కిలోమీటర్ల పొడవునా ధ్వంసమయ్యాయి. ఈ మేరకు నష్టం అంచనాలను రూపొందించి కలెక్టర్ నాగలక్ష్మి ప్రభుత్వానికి నివేదించారు.



వరదలకు పూర్తిగా దెబ్బతిన్న టమోటా తోట

నష్టం.. రూ.56 కోట్లు

● 28,201 ఎకరాల్లో దెబ్బతిన్న పంటలు ● వ్యవసాయ, ఉద్యానశాఖలు ప్రాథమిక అంచనా ● పూర్తి స్థాయిలో లెక్కింపునకు ప్రత్యేక బృందాలు

పల్నాడు జిల్లాలో..

నరసరావుపేట(ఆంధ్రజ్యోతి): వర్షాలు.. వరదల కారణంగా జిల్లాలో పంటలకు అపార నష్టం వాటిల్లింది. నీట మునగడంతో పంటలు ఆదిలోనే దెబ్బతినడంతో రైతులు కన్నీరు మున్నీరవుతున్నారు. పొలాల్లో నీరు నిలిచి పంటలు ఉరకెత్తుతున్నాయి. కాపు దశలోనే పత్తి పంట దెబ్బతినడంతో రైతులు అవేదన చెందుతున్నాయి. ప్రభుత్వ సాయం కోసం ఆశగా ఎదురు చూస్తున్నారు. ప్రాథమిక అంచనా ప్రకారం 28,201 ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నట్లు అధికారులు గుర్తించారు. రెండు రోజుల్లో పంట నష్టం అంచనా 7 వేల ఎకరాలు పెరిగింది. ఈ లెక్కల ప్రకారం ఇప్పటికి దాదాపు రూ.56 కోట్ల వరకు పంట నష్టం వాటిలినట్లు ప్రాథమిక అంచనా. పంట నష్టం పూర్తి స్థాయిలో లెక్కించేందుకు వ్యవసాయ శాఖ ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసింది. మండల, గ్రామ స్థాయిలో ఈ బృందాలు పంట నష్టం లెక్కించే ప్రక్రియను బుధవారం జిల్లా అంతటా పారంభించాయి. వ్యవసాయ శాఖ అంచనా ప్రకారం 27,013 ఎకరాల్లో పత్తి, వరి, కంది తదతర పంటలకు నష్టం వాటిల్లింది. ఉద్యాన పంటలు 1,188 ఎకరాల్లో దెబ్బతిన్నట్లు ప్రాథమికంగా నిర్ధారించారు. ఉద్యాన పంటలకు భారీగానే నష్టం వాటిల్లింది. 1,187 ఎకరాల్లో అరటి, పసుపు, మిరప తదితర పంటలకు నష్టం వాటిల్లిందని ఉద్యాన శాఖ తెలిపింది. పిడుగురాళ్ల, ముప్పాళ్ల మండలాల్లో పసుపు పంట దెబ్బతింది. నరసరావుపేట, గురజాల, అమరావతి, అచ్చంపేట, పెదకూరపాడు, చిలకలూరిపేట, సతెఎనపల్లి మండలాల్లో ఉద్యాన పంటలకు నష్టం వాటిల్లింది.

ఆంధ్రజ్యోతి 6

నవ్య చిత్రజ్యోతి

గుంటూరు ● గురువారం 5 సెప్టెంబరు 2024

cinema@andhrajyothy.com

మేమున్నామని.. మీకేం కాదని..

వరద బాధితులకు సినీ ప్రముఖుల సాయం









వరదలతో ఇబ్బంది పడుతున్న తెలుగు ప్రజానీకాన్ని ఆదుకునేందుకు కొంతమంది సినీ ప్రముఖులు ఇప్పటికే తమవంతు సాయాన్ని అందించగా బుధవారం మరికొందరు విరాళాలను ప్రకటించారు. వరద బాధితులను ఆదుకునేందుకు చిరంజీవి రూ. కోటి సాయాన్ని ప్రకటించారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ముఖ్యమంత్రుల సహాయనిధికి చెరో రూ. 50 లక్షలు ఇస్తున్నట్లు ఆయన సోషల్ మీడియా వేదికగా తెలిపారు. 'వరద వల్ల ప్రజలు పడుతున్న ఇబ్బందులు నన్ను కలిచివేశాయి. పదుల సంఖ్యలో అమాయకులు ప్రాణాలు కోల్పోవడం బాధాకరం. అందరూ తమకు తోచినట్లు సహాయ కార్యక్రమాల్లో పాలు పంచుకోవాలి. ఈ విపత్కర పరిస్థితులు త్వరలోనే తొలగిపోవాలి' అని ఆయన ఆకాంక్షించారు. చిరు తనయుడు రామ్‌చరణ్ సైతం రూ. 50 లక్షల చొప్పున రెండు తెలుగు రాష్ట్రాలకు కలిపి రూ. కోటి విరాళాన్ని ప్రకటించారు. తెలుగు ప్రజలకు అందరూ అండగా ఉండాల్సిన సమయమిదని రామ్‌చరణ్ పేర్కొన్నారు. ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ మంగళవారం ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి సహాయనిధికి రూ. కోటి విరాళంగా ఇస్తున్నట్లు ప్రకటించిన విషయం తెలిసిందే. తెలంగాణ ముఖ్యమంత్రి సహాయనిధికి కూడా రూ. కోటి విరాళంగా ఇస్తున్నట్లు ఆయన బుధవారం ప్రకటించారు. అలాగే ఆంధ్రప్రదేశ్‌లో వరద బారిన పడిన 400 పంచాయతీలకు ఒక్కోదానికి రూ. లక్ష చొప్పున మొత్తం రూ. నాలుగు కోట్ల సాయాన్ని అందజేయనున్నట్లు తెలిపారు.

అగ్ర కథానాయకుడు ప్రభాస్ తన వంతుగా రూ. రెండు కోట్ల విరాళాన్ని ప్రకటించారు. తెలంగాణకు, ఆంధ్రప్రదేశ్‌కు రూ. కోటి చొప్పున అందజేయనున్నట్లు ఆయన టీమ్ తెలిపింది. అల్లు అర్జున్ రెండు తెలుగు రాష్ట్రాలకు కలిపి రూ. కోటి విరాళంగా ఇస్తున్నట్లు సోషల్ మీడియా ద్వారా తెలిపారు. ఈ విపత్కర పరిస్థితులు తొలగిపోయి ప్రజలంతా సురక్షితంగా ఉండాలని ఆయన ఆకాంక్షించారు. వరద బాధితులను ఆదుకునేందుకు అక్కినేని కుటుంబం, గ్రూపు సంస్థలు రెండు రాష్ట్రాలకు కలిపి రూ. కోటి విరాళాన్ని ప్రకటించాయి. ఏపీ సీఎం రిలీఫ్ ఫండ్‌కు రూ. 25 లక్షల సాయాన్ని ప్రకటించిన వైజయంతీ మూవీస్ సంస్థ తాజాగా తెలంగాణ సీఎం రిలీఫ్ ఫండ్‌కు రూ. 20 లక్షల విరాళాన్ని ప్రకటించింది. నిర్మాత అశ్వనీదత్ బుధవారం ఏపీ సీఎం చంద్రబాబు నాయుడును కలసి చెక్ అందజేశారు. హీరో సాయిదుర్గ తేజ్ ఇరు రాష్ట్రాలకు కలిపి రూ. 20 లక్షలు, విజయవాడలోని అమ్మ ఆశ్రమానికి రూ. 5 లక్షల విరాళం ప్రకటించారు. అలీ, జుబేదా దంపతులు ఇరు రాష్ట్రాలకు కలిపి రూ. ఆరు లక్షలు విరాళంగా ఇస్తున్నట్లు తెలిపారు.

పవన్ కల్యాణ్ - రూ. 2 కోట్లు (ఏపీలోని గ్రామ పంచాయితీలకు రూ. 4 కోట్లు)
ప్రభాస్ - రూ. 2 కోట్లు
చిరంజీవి - రూ. కోటి
రామ్‌చరణ్ - రూ.కోటి
అల్లు అర్జున్ - రూ. కోటి
అక్కినేని కుటుంబం, గ్రూప్ సంస్థలు కలిపి - రూ. కోటి
సాయిదుర్గ తేజ్ -రూ.20 లక్షలు
వైజయంతీ మూవీస్ - రూ. 20 లక్షలు (తెలంగాణకు)
అలీ, జుబేదా దంపతులు - రూ. 6 లక్షలు

సమంతకు గాయం



టాలీవుడ్ కథానాయిక సమంత గాయపడ్డారు. ఈ విషయాన్ని ఆమె బుధవారం సోషల్ మీడియా ద్వారా తెలిపారు. ఎప్పుడు, ఎలా గాయపడ్డారు అనే వివరాలను ఆమె వెల్లడించలేదు. మోకాలి గాయానికి ఆక్యుపంచర్ విధానంలో చికిత్స తీసుకుంటున్నారు సమంత. తన శరీరంలో రెండు సూదులు గుచ్చి ఉన్న ఫొటోను ఆమె షేర్ చేసి, 'గాయాల బారిన పడకుండా యాక్షన్ స్టార్‌ను అవ్వగలనా?' అని సరదాగా స్పందించారు. దీంతో సమంత లీడ్‌రోల్‌లో నటిస్తూ, నిర్మిస్తున్న 'మా ఇంటి బంగారం' చిత్రం షూటింగ్‌లో గాయపడ్డారని భావిస్తున్నారు. ఆమె నటించిన 'హనీ బన్నీ' వెబ్‌సిరీస్ త్వరలో ప్రముఖ ఓటీటీలో స్ట్రీమింగ్ అవనుంది.

లైంగిక వేధింపులకు పాల్పడితే ఐదేళ్ల నిషేధం

నడిగర్ సంఘం మహిళా భద్రతా కమిటీలో తీర్మానం



నటీమణులపై లైంగిక వేధింపులకు పాల్పడినట్టు రుజువైతే చిత్రపరిశ్రమలో పనిచేయకుండా ఐదేళ్లపాటు నడిగర్ సంఘం నిషేధం విధించనుంది. ఈ మేరకు నడిగర్ సంఘం అనుబంధ విభాగమైన మహిళా భద్రతా కమిటీ సమావేశంలో తీర్మానించారు. ఈ కమిటీ సమావేశం బుధవారం నడిగర్ సంఘం అధ్యక్షుడు నాజర్, ఉపాధ్యక్షుడు పూచ్చి మురుగన్, కోశాధికారి కార్తీ, కమిటీ అధ్యక్షురాలు రోహిణి సారథ్యంలో కమిటీ సభ్యులు సుహాసిని, ఖుష్బూ, లలిత కుమారి, కోవై సరళ తదితరులు పాల్గొన్నారు. ఇందులో కొన్ని తీర్మానాలు చేసి ఏకగ్రీవంగా ఆమోదించారు. లైంగిక వేధింపులకు పాల్పడినట్టు ఎవరైనా బాధితులు ఫిర్యాదు చేస్తే వాటిపై విచారణ జరిపి నిజమని తేలితే చిత్ర పరిశ్రమలో పనిచేయకుండా ఐదేళ్లపాటు నిషేధం విధించేలా తీర్మానం చేశారు. బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేసేందుకు, న్యాయ సలహాలు ఇప్పించేందుకు అవసరమైన సహాయ సహకారాలు అందించనున్నారు. లైంగిక వేధింపులకు పాల్పడిన వారిని తొలుత హెచ్చరించి, ఆ తర్వాత చర్యలకు ఉపక్రమిస్తారు. కమిటీకి ఫిర్యాదు చేసే బాధితులు మీడియాతో ప్రత్యక్షంగా మాట్లాడకూడదు. యూట్యూబ్‌లో సినీ నటులను కించపరిచేలా మాట్లాడేవారిపై బాధితులు సైబర్ విభాగం పోలీసులకు ఫిర్యాదు చేస్తే వారికి కమిటీ అన్ని విధాలా సహకరిస్తుంది.

- చెన్నై (ఆంధ్రజ్యోతి)



కొరమీనా నిన్ను.. కోసుకుంటా ఇయ్యాలా

జూనియర్ ఎన్టీఆర్ నటిస్తున్న 'దేవర 1' చిత్రం నుంచి మాస్ నంబర్‌ను విడుదల చేశారు. 'కొరమీనా నిన్ను.. కోసుకుంటా ఇయ్యాలా' అంటూ రామజోగయ్యశాస్త్రి రాసిన పాట వీడియోను విడుదల చేశారు. ఈ పాటలో ఎన్టీఆర్ వేసిన స్టెప్పులు ఆడియన్స్‌తో డాన్స్ చేయించేలా ఉన్నాయి. ఎన్టీఆర్ డాన్స్ ఎలా ఉండాలని అభిమానులు కోరుకుంటారో దాన్ని మించేలా శేఖర్ మాస్టర్ ఈ పాటకు కొరియోగ్రఫీ అందించారు. జాన్వీకపూర్ గ్లామరస్‌గా కనిపించారు. ఎన్టీఆర్‌తో పోటీగా స్టెప్స్ వేశారు. 'దేవర' మీద ఇప్పటివరకూ ఉన్న అంచనాలు ఈ పాటతో నెక్ట్స్ లెవల్‌కు చేరాయి. అనిరుధ్ అందించిన సంగీతం పాటకు ప్రాణం పోసింది. హై యాక్షన్ థ్రిల్లర్‌గా రూపుదిద్దుకుంటున్న 'దేవర' రెండు భాగాలుగా ప్రేక్షకులను అలరించనుంది. మొదటి భాగాన్ని ఈ నెల 27న తెలుగు, తమిళ, హిందీ, మలయాళ, కన్నడ భాషల్లో విడుదల చేస్తున్నారు. కొరటాల శివ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని కల్యాణ్‌రామ్ సమర్పణలో మిక్కిలినేని సుధాకర్, హరికృష్ణ నిర్మిస్తున్నారు.

ఇన్ ప్రోగ్రెస్

విడుదల వాయిదా



'ఈ నెల ఏడున 'జనక అయితే గనక' సినిమాను విడుదల చేయాలనుకున్నాం.అయితే ప్రస్తుతం తెలుగు రాష్ట్రాల్లో వరద పరిస్థితుల కారణంగా విడుదల వాయిదా వేస్తున్నాం. నవ్వుల వినోదం పండించే రోజుని త్వరలో ప్రకటిస్తాం. ప్రేక్షకులు అందరూ థియేటర్లలో చూసి ఆస్వాదించాల్సిన సినిమా కనుక ఈ నిర్ణయం తీసుకున్నాం' అని వెల్లడించారు దిల్ రాజు. సుహాస్ హీరోగా రూపుదిద్దుకున్న 'జనక అయితే గనక' చిత్రానికి సందీప్‌రెడ్డి బండ్ల దర్శకత్వం వహించారు. శిరీష్ సమర్పణలో హర్షిత్‌రెడ్డి, హన్షిత రెడ్డి నిర్మించారు. హీరో సుహాస్ మాట్లాడుతూ 'మూవీ ఫైనల్ వెర్షన్ చూశాను. చాలా బాగా నచ్చింది. అందుకే యుఎస్‌ఏ హక్కులు కొన్నాను. ప్రతి దానికీ లెక్కలు చెప్పే మిడిల్ క్లాస్ యువకుడిగా నటించా. దిల్ రాజుగారు ఎంతో సపోర్ట్ చేశారు' అన్నారు.

పిల్లలతో చూడాల్సిన సినిమా



ప్రియదర్శి, విశ్వదేవ్, నివేద థామస్, గౌతమి ప్రధాన పాత్రల్లో తెరకెక్కిన చిత్రం '35 చిన్న కథ కాదు'. నందకిషోర్ ఈమాని దర్శకత్వంలో రానాదగ్గుబాటి, సృజన్ యరబోలు, సిద్ధార్థ్ రాళ్లపల్లి నిర్మించారు. ఈ శుక్రవారం సినిమా తెలుగు, తమిళ, మలయాళ భాషల్లో విడుదలవుతున్న సందర్భంగా చిత్ర బృందం ప్రీ రిలీజ్ వేడుక నిర్వహించారు. ఈ సందర్భంగా నాని మాట్లాడుతూ 'ఇది పిల్లలతో కలసి చూడాల్సిన సినిమా. దర్శకుడు ప్రేక్షకుల హృదయాలను హత్తుకునేలా తెరకెక్కించార'ని ప్రశంసించారు.

మరిచిపోలేని థ్రిల్‌ను పంచుతుంది



వరుస అవకాశాలతో దూసుకుపోతున్నారు మీనాక్షీ చౌదరి. వెంకట్ ప్రభు దర్శకత్వంలో విజయ్ సరసన ఆమె నటించిన 'గోట్' (గ్రేటెస్ట్ ఆఫ్ ఆల్ టైమ్) చిత్రం నేడు విడుదలవుతోంది. ఈ సందర్భంగా చిత్ర విశేషాలను మీనాక్షీ మీడియాతో పంచుకున్నారు.


"ఈ సినిమాలో నాది చాలా మంచి పాత్ర. ఆ పాత్ర నన్ను నేను రిలేట్ చేసుకునేలా ఉంటుంది. దర్శకుడు వెంకట్ ప్రభు ఈ సినిమాలో ప్రతీ క్యారెక్టర్‌ను చాలా బాగా తీర్చిదిద్దారు. ఈ మూవీ షూటింగ్ సమయంలో విజయ్, స్నేహ, లైలా వంటి అనుభవజ్ఞులైన నటుల నుంచి ఎంతో నేర్చుకున్నాను. ఈ సినిమా అందరికీ మరిచిపోలేని థ్రిల్‌ను పంచుతుంది. విజయ్ యాక్టింగ్, వెంకట్ ప్రభు డైరెక్షన్ స్కిల్స్ ఈ సినిమాను మరో స్థాయికి తీసుకెళ్లాయి" అని చెప్పారు.

ఫిష్ వెంకట్‌కు సాయం



విలన్ పాత్రల్లోనూ తనదైన శైలిలో కామెడీని పండిస్తూ తెలుగు ప్రేక్షకులను నవ్వించిన ఫిష్ వెంకట్ రెండు కిడ్నీలు పాడై దయనీయ స్థితిలో జీవితం వెళ్లదీస్తున్నారు. మెరుగైన వైద్యం కోసం ఖర్చు పెట్టే స్తోమత లేక ప్రభుత్వ ఆస్పత్రిలో డయాలసిస్ చేయించుకుంటున్నట్లు ఆయన ఓ ఇంటర్వ్యూలో తెలిపారు. సినిమాల్లో నటించమని పిలుపు వస్తున్నా ఒంట్లో సత్తువ లేక కొన్నేళ్ల నుంచి ఇంటికే పరిమితమైనట్లు చెప్పారు. ఖర్చులకు చేతిలో పైసా లేదు అని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయాన్ని మీడియా ద్వారా తెలుసుకున్న నిర్మాత చదలవాడ శ్రీనివాసరావు వైద్య ఖర్చుల నిమిత్తం లక్ష రూపాయలను అందజేశారు. ప్రసన్న కుమార్, రామసత్యనారాయణ, కె.అజయ్‌కుమార్, అనిల్ ఈ చెక్కును ఫిష్ వెంకట్‌కు అందజేశారు.

జేఎన్‌టీయూకేలో ఎంటెక్ స్పాన్సర్డ్ కోటా



కాకినాడలోని జవహర్‌లాల్ నెహ్రూ టెక్నలాజికల్ యూనివర్సిటీ(జేఎన్‌టీయూకే)- ఎంటెక్ ప్రోగ్రామ్‌లో స్పాన్సర్డ్ కోటా సీట్ల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది. కనీసం ఏడాది అనుభవం ఉన్న వర్కింగ్ ప్రొఫెషనల్స్ దరఖాస్తు చేసుకోవచ్చు.

విభాగాలు-స్పెషలైజేషన్‌లు

- సివిల్ ఇంజనీరింగ్ - స్ట్రక్చరల్ ఇంజనీరింగ్, సాయిల్ మెకానిక్స్ అండ్ ఫౌండేషన్ ఇంజనీరింగ్, వాటర్ రిసోర్స్ ఇంజనీరింగ్
- ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్ - హై ఓల్టేజ్ ఇంజనీరింగ్, అడ్వాన్స్‌డ్ ఎలక్ట్రికల్ పవర్ సిస్టమ్స్, పవర్ ఎలక్ట్రానిక్స్ అండ్ డ్రైవ్స్, పవర్ ఎలక్ట్రానిక్స్
- మెకానికల్ ఇంజనీరింగ్ - క్యాడ్/క్యామ్, మెషిన్ డిజైన్, థర్మల్ ఇంజనీరింగ్
- ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్ - కమ్యూనికేషన్ ఇంజనీరింగ్ అండ్ సిగ్నల్ ప్రాసెసింగ్, కంప్యూటర్ అండ్ కమ్యూనికేషన్, వీఎల్‌ఎస్‌ఐ అండ్ ఎంబెడెడ్ సిస్టమ్స్
- కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ - కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్, ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ అండ్ మెషిన్ లెర్నింగ్, సైబర్ సెక్యూరిటీ.
- రెన్యూవబుల్ ఎనర్జీ అండ్ ఎన్విరాన్‌మెంట్ - రెన్యూవబుల్ ఎనర్జీ, ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీరింగ్ అండ్ మేనేజ్‌మెంట్
- బయోటెక్నాలజీ, నానోటెక్నాలజీ, రిమోట్ సెన్సింగ్, ఫుడ్ ప్రాసెసింగ్ టెక్నాలజీ, ఏవియానిక్స్, ఎన్విరాన్‌మెంటల్ ఆక్యుపేషనల్ హెల్త్ అండ్ సేఫ్టీ

అర్హత: సంబంధిత విభాగంలో బీఈ/బీటెక్/ఏఐఎంఈ లేదా ఎమ్మెస్సీ(కెమిస్ట్రీ/ఫిజిక్స్/బయోటెక్నాలజీ/ఎర్త్‌సైన్స్/ఎన్విరాన్‌మెంటల్ సైన్స్ అండ్ టెక్నాలజీ/ఎలక్ట్రానిక్స్/జియాలజీ/ఫుడ్ టెక్నాలజీ/ఫుడ్ సైన్స్ అండ్ న్యూట్రిషన్/డెయిరీ టెక్నాలజీ) ఉత్తీర్ణులై ఉండాలి. కనీసం 50 శాతం మార్కులు తప్పనిసరి. గేట్ 2024/జీప్యాట్ 2024/ఏపీ పీజీఈసెట్ 2024 ర్యాంక్ ఉండాలి.

- **దరఖాస్తుకు చివరి తేదీ:** సెప్టెంబరు 17
- **వెబ్‌సైట్:** www.jntuk.edu.in

'దిక్సూచి' వెబ్ పేజీలో..
సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.
లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/cHqjyDZలో చదవండి.

దిక్సూచి DIKSUCHI

ఐఐఎఫ్‌టీలో సర్టిఫికెట్ ప్రోగ్రామ్

న్యూఢిల్లీలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫారిన్ ట్రేడ్(ఐఐఎఫ్‌టీ)- 'ఆన్‌లైన్ సర్టిఫికెట్ ప్రోగ్రామ్ ఆన్ ఎక్స్‌పోర్ట్ ఇంపోర్ట్ మేనేజ్‌మెంట్‌'లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ఇది వీకెండ్ ప్రోగ్రామ్. ఇందులో ఆరు మాడ్యూల్స్ ఉంటాయి. దీని వ్యవధి నాలుగు నెలలు(150 గంటలు). ఉదయం తొమ్మిది గంటల నుంచి మధ్యాహ్నం పన్నెండుంబావు వరకు, సాయంత్రం రెండు నుంచి అయిదుంబావు వరకు సెషన్స్ నిర్వహిస్తారు. కనీసం 75 శాతం అటెండెన్స్ తప్పనిసరి. ప్రోగ్రామ్‌లో భాగంగా అసైన్‌మెంట్లు, అసెస్‌మెంట్లు, ప్రజంటేషన్స్, ప్రాజెక్ట్ వర్క్‌లు, ఇంటర్నల్ ఎగ్జామ్స్, ఫైనల్ ఎగ్జామ్స్ ఉంటాయి. కోర్సు మెటీరియల్‌కు సంబంధించి లైఫ్ టైమ్ యాక్సెస్ ఇస్తారు. గుర్తింపు పొందిన కళాశాల నుంచి ఏదేని డిగ్రీ ఉత్తీర్ణులు దరఖాస్తు చేసుకోవచ్చు.

- **దరఖాస్తుకు చివరి తేదీ:** సెప్టెంబరు 10
- **వెబ్‌సైట్:** www.iift.ac.in

ఆదుకుంటాం.. అండగా ఉంటాం


రేపల్లె మండలం, బొబ్బర్లంక గ్రామంలో పునరావాస కేంద్రంలో ఉన్న ప్రజల సమస్యలు వింటున్న మంత్రులు అనగాని సత్యప్రసాద్, గొట్టిపాటి రవికుమార్

- ఇళ్లు కోల్పోయిన వారికి పక్కా గృహాలు నిర్మిస్తాం
- పంట దెబ్బతిన్న రైతులను ప్రభుత్వం ఆదుకుంటుంది
- మంత్రులు అనగాని, గొట్టిపాటి

రేపల్లె, సెప్టెంబరు 4: వరద కారణంగా నష్టపోయిన రైతులను ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకుంటుందని రెవెన్యూశాఖామంత్రి అనగాని సత్యప్రసాద్ అన్నారు. బుధవారం రేపల్లె మండలం వరద ప్రభావిత ప్రాంతాలైన పెనుమూడి, రాజుకాల్వ, లంకేవానిదిబ్బ, తుమ్మల,పోటుమెరక, నల్లూరుపాలెం గ్రామాల్లో పర్యటించి బాధితులకు అండగా ఉండి ఆదుకుంటామని భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా మంత్రి అనగాని మాట్లాడుతూ గత ఐదేళ్ల వైసీపీ పాలనలో కరకట్టల మరమ్మతులు నిర్వహించని దాఖలాలు లేవన్నారు. వైసీపీ ప్రభుత్వం చేసిన తప్పుల ఫలితాలను ఇప్పుడు ప్రజలు అనుభవించాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. వరద కారణంగా ఇళ్లు కోల్పోయిన వారికి నివేశన స్థలాలు ఇచ్చి పక్కా గృహాలు నిర్మించేందుకు కృషి చేస్తామన్నారు. ప్రస్తుతం ఆర్థికంగా ఆదుకునే దిశగా ప్రభుత్వం ముందుకు వెళ్తుందన్నారు. సముద్రం నీరు పోటెత్తటంతో లంకేవానిదిబ్బ మత్స్యకారుల గృహాల్లోకి నీరు చేరి చాలా ఇబ్బందులకు గురయ్యారని, వాటన్నింటిని రెండు రోజుల్లో మెరుగు పరుస్తామని చెప్పారు. వేలాది ఎకరాలు నేటికీ నీటిలోనే నానిపోయి పంట కుళ్లిపోయిందని రైతులు తెలిపారన్నారు. రైతుల వద్ద నుంచే వ్యవసాయ శాఖ అధికారులకు ఫోన్ చేసి దెబ్బతిన్న పొలాలకు సంబంధించి తక్షణమే పంట నష్టం అంచనాలను రూపొందించాలని ఆదేశాలు జారీ చేశారు. విద్యుత్ శాఖామంత్రి గొట్టిపాటి రవికుమార్ మాట్లాడుతూ కృష్ణా కరకట్ట వెంబడి ఉన్న గ్రామాలైన పెనుమూడి పల్లెపాలెం, ఓలేరు పల్లెపాలెం,మైనేనివారిపాలెం, మోర్తోట, బొబ్బర్లంక, లంకేవానిదిబ్బ తదితర గ్రామాల్లో విద్యుత్ సమస్యలను తక్షణమే పరిష్కరిస్తామని, విద్యుత్‌కు అంతరాయం కలగకుండా చర్యలు చేపడతామని తెలిపారు. వరదల కారణంగా నష్టపోయిన కుటుంబాలను, నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకునే దిశగా ముందుకు వెళ్తుందన్నారు. ఎవరూ అధైర్యపడాల్సిన పనిలేదనీ, టీడీపీ ప్రభుత్వం ప్రజలకు అండగా నిలిచి ఆర్థికంగా ఆదుకుంటుందని తెలిపారు. కార్యక్రమంలో తెదేపా నాయకులు రేపల్లె రామాంజనేయులు, పంతాని మురళీధరరావు, కొపనాతి రాజశేఖర్, గూడపాటి శ్రీనివాసరావు, మేకా వెంకట శివరామకృష్ణ, జనసేన పార్టీ మండల అధ్యక్షుడు రేపల్లె జానకిరామయ్య, నియోజకవర్గ సమన్వకర్త మత్తి భాస్కరరావు, రేపల్లె పాపారావు, అనగాని శివప్రసాద్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

రేపటి వరకు కొండవీడుకోట సందర్శన నిలిపివేత

యడ్లపాడు, సెప్టెంబరు 4: చారిత్రక కొండవీడుకోట సందర్శనను ఈ నెల 6 వరకు నిలిపివేస్తున్నట్లు జిల్లా అటవీశాఖాధికారి రామచంద్రరావు తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ ఇటీవల కురిసిన భారీ వర్షాలకు కొండవీడుకోట ఘాట్ రోడ్డులో పలు చోట్ల కొండచరియలు విరిగిపడిన విషయం తెలిసిందేనన్నారు. విరిగిపడిన కొండచరియలను ఆర్‌అండ్‌బీ అధికారుల సహకారంతో తొలగిస్తున్నామన్నారు. వర్షం పడుతున్నందున కొండచరియలు తొలగింపు పనుల్లో జాప్యం జరుగుతుందన్నారు. అంతేకాకుండ కురుస్తున్న వర్షాలకు కొండచరియలు మళ్లీ విరిగిపడే అవకాశం ఉన్నందున ఈ నెల 6వ తేదీ వరకు కొండవీడు కోట, నగరవనం సందర్శనను నిలిపివేస్తున్నట్లు వెల్లడించారు. పర్యాటకులు గమనించి సహకరించాలని కోరారు.

పీజీ అడ్మిషన్ల సీట్ల కేటాయింపు

పెదకాకాని, సెప్టెంబరు 4: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో సైన్సు, ఆర్ట్స్ కళాశాలల్లో పోస్ట్ గ్రాడ్యుయేషన్ కోర్సుల సీట్లను ఉన్నత విద్యా మండలి కేటాయించింది. రాష్ట్రవ్యాప్తంగా యూనివర్సిటీల్లో పోస్ట్ గ్రాడ్యుయేషన్ సీట్ల భర్తీకి నిర్వహించిన ఏపీ పీజీ కామన్ ఎంట్రన్స్ టెస్ట్ 2024 ద్వారా ఈ సీట్లు భర్తీ జరిగింది. కాగా విశ్వవిద్యాలయంలో సైన్సు, ఆర్ట్స్ కోర్సులలో విద్యార్థులకు సీట్లు ఖరారు కావడంతో విద్యార్థులు వర్సిటీకి వచ్చి ఆయా విభాగాలను సందర్శించి ప్రవేశాలు పొందుతున్నారు. బుధవారం నుంచి పీజీ అడ్మిషన్లకు వచ్చే విద్యార్థుల కోలాహలం వర్సిటీలో మొదలైయింది. 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించి ఈ ప్రవేశాలను చేపట్టారు. అయితే సీట్లు పొందిన విద్యార్థులు ఈ నెల 10వ తేదీ వరకు ఆయా విభాగాల్లో చేరేందుకు పీజీ సెట్ కన్వీనర్ అవకాశం కల్పించారు. ఈ సందర్భంగా పీజీ అడ్మిషన్ల డైరెక్టర్ డాక్టర్ పి. బ్రహ్మాజీరావు వర్సిటీ కళాశాలలో పీజీ సీట్ల భర్తీ సంతృప్తికరంగా ఉన్నట్లు పేర్కొన్నారు.

విజిలెన్స్ అధికారిగా సూర్య శ్రవణ్ కుమార్

గుంటూరు సిటీ, సెప్టెంబర్ 4 : గుంటూరు ప్రాంతీయ విజిలెన్స్ అండ్ ఎన్ఫోర్స్మెంట్ అధికారిగా డి సూర్య శ్రవణ్ కుమార్ నియమితులయ్యారు. ఈ మేరకు బుధవారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. ఏఎస్పీగా పనిచేస్తున్న ఆయన్ను గుంటూరు విజిలెన్స్ ప్రాంతీయ అధికారిగా నియమించారు. గురువారం ఉదయం ఆయన బాధ్యతలు స్వీకరించనున్నారు.

వరద బాధితులకు రూ. 25 లక్షల విరాళం


సీఎంకు చెక్కు అందిస్తున్న ఆలపాటి, రాయపాటి, క్లబ్ పాలక వర్గ ప్రతినిధులు

గుంటూరు, సెప్టెంబరు 4: ఎల్‌వీఆర్ అండ్ సన్స్ క్లబ్ పాలక వర్గ ప్రతినిధులు సీఎం చంద్రబాబును కలిసి రూ. 25 లక్షల చెక్కును అందించారు. మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్ర ప్రసాద్, చుక్కపల్లి రమేష్, పాలకవర్గ ప్రతినిధులు గౌరవ అధ్యక్షులు డాక్టర్ రాయపాటి శ్రీనివాస్, అధ్యక్షులు మైనేని బ్రహ్మేశ్వరరావు, ఉపాధ్యక్షులు వణుకూరి శ్రీనివాసరెడ్డి, కార్యదర్శి యాగంటి దుర్గారావు, సంయుక్త కార్యదర్శి కొండ్రగుంట శ్రీనివాసరావు, కోశాధికారి యేల్చూరి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

వరద బాధితులకు విజ్ఞాన్ వర్సిటీ చేయూత

గుంటూరు(విద్య), సెప్టెంబరు 4: విజయవాడలోని వరద బాధితులకు విజ్ఞాన్ వర్సిటీ చేయూత అందించినట్లు వీసీ ఆచార్య పి.నాగభూషన్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. వడ్లమూడిలోని యూనివర్సిటీ నుంచి వరుగా రెండో రోజు ఆరు ప్రత్యేక బస్సుల్లో పదివేల కిచిడి ప్యాకెట్లు ,పెరుగు అన్నం, వాటర్ ప్యాకెట్లు పంపినట్లు వెల్లడించారు. కష్టసమయంలో ప్రతి ఒక్కరూ తమవంతు సహాయం చేయాలనే స్ఫూర్తితో తాము వరద బాధితులకు అండగా నిలిచినట్లు తెలిపారు. విజయవాడలోని ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన శిబిరంలో ఆహారం అందజేశామని తెలిపారు. విద్యార్థులు, వివిధ విభాగాల డీన్లు పాల్గొన్నారు.

కృష్ణమ్మకు సారె సమర్పణ

తాడేపల్లి టౌన్, సెప్టెంబరు 4: గత నాలుగు రోజులుగా భారీ వరదతో ఉగ్రరూపం దాల్చిన కృష్ణమ్మ శాంతించాలని వేద విశ్వవిద్యాలయ వ్యవస్థాపకులు త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చిన్న జీయర్ స్వామి సీతానగరం పుష్కర ఘాట్ల వద్ద నదికి బుధవారం ప్రత్యేక పూజలు చేశారు. కృష్ణమ్మకు పసుపు, కుంకుమ, సారె సమర్పించారు. కార్యక్రమంలో శ్రీ అహోబిల జీయర్ స్వామి, చిన్న జీయర్ ఆశ్రమ నిర్వాహకులు పురాణం వెంకటాచార్యులు, రఘునాథాచార్యులు, శ్రీనివాసాచార్యులు, అనంత స్వామి, శంకర్‌రెడ్డి, వేద విద్యార్థులు స్థానికులు పాల్గొన్నారు.

నేటి నుంచి యథావిధిగా పాఠశాలలు

గుంటూరు(విద్య),సెప్టెంబరు 4: జిల్లాలో నేటి నుంచి విద్యాసంస్థలు యథావిధిగా నిర్వహించాలని డీఈవో పి.శైలజ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అన్ని ప్రభుత్వ ప్రైవేటు యాజమాన్యాలు యథావిధిగా విద్యాసంస్థల్ని కొనసాగించాలని సూచించారు. బాధితులు ఆశ్రయం పొందుతున్న పాఠశాలలకు మాత్రం సెలవు ప్రకటించాలని హెచ్‌ఎంలకు సూచించారు. తుఫాను తరువాత పాఠశాలలు ప్రారంభం అవుతున్న నేపథ్యంలో గదుల్ని నిశితంగా తనిఖీ చేయాలని, ఏ సమస్యలు లేని గదుల్లో మాత్రమే తరగతులు నిర్వహించాలని సూచించారు.

వరద బాధితులను ప్రభుత్వం ఆదుకుంటుంది


గండికి శాశ్వత పరిష్కారంపై చర్చిస్తున్న ప్రత్యేక అధికారి, కలెక్టర్, ఎమ్మెల్యే

- జిల్లా కలెక్టర్ వెంకటమురళి, ఎమ్మెల్యే ఆనందబాబు

కొల్లూరు, సెప్టెంబరు 4: కృష్ణానది వరద బీభత్సానికి సర్వస్వం కోల్పోయిన బాధితులను ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకుంటుందని జిల్లా విపత్తు నిర్వహణ ప్రత్యేకాధికారి ఎంవీ శేషగిరిబాబు, కలెక్టర్ వెంకటమురళి, ఎమ్మెల్యే ఆనందబాబు పేర్కొన్నారు. వరద ఉధృతికి దెబ్బతిన్న లంక గ్రామాల్లో బుధవారం వారు పర్యటించారు. పెసర్లంక గ్రామంలో వైద్య శిబిరాన్ని పరిశీలించి వారికి పలు సూచనలు చేశారు. వరద ప్రభావిత లంక గ్రామాల్లోని అన్ని గృహాలకు వెళ్లి మందులు అందజేయాలని వైద్య సిబ్బందికి సూచించారు. వరద నీరు చేరిన గృహాలను సందర్శించి బాధితులతో మాట్లాడారు. అనంతరం అరవింద వారధి వద్దకు చేరుకుని మూడు రోజుల క్రితం గండి వద్ద పోసిన కట్ట తెగిపోయిన ప్రాంతాన్ని ఎమ్మెల్యేతో పాటు ప్రత్యేక అధికారి, కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గండి వద్ద శాశ్వత పరిష్కారం చూడాలనీ, భవిష్యత్‌లో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా గట్టి చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉందన్నారు. గండి విషయం ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తానని ఎమ్మెల్యే అధికారులకు తెలిపారు. కొల్లూరు కరకట్ట దిగువున దెబ్బతిన్న ప్రధాన రహదారికి మరమ్మతులు చేయిస్తున్నామని కలెక్టర్, ఎమ్మెల్యేలు తెలిపారు. ప్రజల రాకపోకలకు ఎటువంటి అంతరాయం లేకుండా చూడాలని ఎమ్మెల్యే సూచించారు. గృహ సందర్శనలో బాధితులతో మాట్లాడిన కలెక్టర్ ఆహార పదార్థాల పంపిణీపై ఆరా తీశారు. లంక గ్రామాల్లో ప్రజలకు తక్షణ సహాయక చర్యలు అందిస్తామని చెప్పారు. అంటు వ్యాధులు ప్రబలకుండా పారిశుధ్యం మెరుగు పనులు చేపడుతున్నట్లు తెలిపారు. వైద్య సిబ్బందితో సర్వే నిర్వహించి వైద్య సేవలు అందించాలని శేషగిరిబాబు కలెక్టర్‌కు సూచించారు. లంక గ్రామాల్లో తీసుకోవాల్సిన సత్వర చర్యలపై ప్రత్యేక అధికారి, కలెక్టర్, ఎమ్మెల్యేలు ఆయా శాఖల అధికారులకు సూచనలు చేశారు.

వరద విపత్తు.. భారీగా విరాళాలు


సీఎం చంద్రబాబుకు రూ.25 లక్షల చెక్కు అందజేస్తున్న చుక్కపల్లి రమేష్, రాకేష్


సీఎంకు చెక్కు అందజేస్తున్న జేసీ నాయుడు, నందకిషోర్

పయనీర్ సంస్థల ఆధ్వర్యంలో...

గుంటూరు, సెప్టెంబరు 4: వరద బాధితులను ఆదుకునేందుకు పయనీర్ సంస్థల చైర్మన్ చుక్కపల్లి రమేష్, మేనేజింగ్ డైరెక్టర్ చుక్కపల్లి రాకేష్ ముందుకొచ్చారు. ఈ మేరకు బుధవారం విజయవాడలో ముఖ్యమంత్రి చంద్రబాబును కలిసి సీఎంఆర్ఎఫ్ కింద రూ.25 లక్షల చెక్కును అందజేశారు. మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ తదితరులున్నారు.

- ఇండియన్ మెడికల్ అసోసియేషన్ గుంటూరు శాఖ అధ్యక్షుడు డాక్టర్ నూతక్కి శ్రీనివాసరావు, కార్యదర్శి డాక్టర్ బూసిరెడ్డి నరేంద్రరెడ్డి తదితరులు బుధవారం రూ. లక్ష చెక్కును కలెక్టర్ నాగలక్ష్మికి అందజేశారు.

ఐఎంఏ తరపున..

గుంటూరు (మెడికల్) సెప్టెంబర్ 4: ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) రాష్ట్ర నాయకులు ముంపు ప్రాంత ప్రజలను ఆదుకొనేందుకు తమ వంతుగా రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఐఎంఏ వైద్యులు అందజేసిన మొదటి విడత నగదు రూ..25 లక్షలను ముఖ్యమంత్రి నారా చంద్రబాబుకు అందజేశారు. ఐఎంఏ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ జయచంద్ర నాయుడు, కార్యదర్శి డాక్టర్ ఫణిధర్, స్టేట్ ప్రెసిడెంట్ ఎలెక్ట్ డాక్టర్ నందకిషోర్, కోశాధికారి డాక్టర్ రవీంద్రరెడ్డి, డాక్టర్ సురేష్ తదితరులు పాల్గొన్నారు.


సీఎంకు చెక్కు అందజేస్తున్న డాక్టర్ రాయపాటి శ్రీనివాస్

నాగర్జున ఎడ్యుకేషనల్ సొసైటీ వితరణ

గుంటూరు(విద్య), సెప్టెంబరు 4: నాగార్జున ఎడ్యుకేషనల్ సొసైటీ(ఎన్ఇఎస్) సభ్యులు తమవంతు వితరణ ప్రకటించారు. బుధవారం సొసైటీ చైర్మన్ డాక్టర్ రాయపాటి శ్రీనివాస్ ఆధ్వర్యంలో సీఎంను విజయవాడలో కలిసి రూ. 25 లక్షలు చెక్కును అందజేశారు.

గుంటూరు, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): అమరావతి జేఏసీ నాయకురాలు డాక్టర్ రాయపాటి శైలజ వరద బాధితులకు రూ.5 లక్షల సాయం అందజేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబును బుధవారం కలిసి ఆయనకు రూ.5 లక్షల చెక్కును ఆమె అందజేశారు.

రూ.10 లక్షలు విరాళం

గుంటూరు(కార్పొరేషన్), సెప్టెంబర్ 4: వరద బాధితుల సహాయార్థం ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మీ అన్నారు. బుధవారం నరేడ్కో గుంటూరు జిల్లా బిల్డర్స్ అసోసియేషన్ ప్రతినిధులు నగర కమిషనర్ పులి శ్రీనివాసులుతో కలిసి జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి రూ.10 లక్షల విరాళం చెక్కును, వాకర్స్ ఇంటర్నేషనల్ ప్రెసిడెంట్ చెలికాని సీతారామయ్య రూ.10 వేలు విరాళం అందించారు.

కలెక్టర్ పిలుపు

గుంటూరు సిటీ, సెప్టెంబర్ 4: ఆపదలో ఉన్నవారికి అండగా నిలవాలని కలెక్టర్ నాగలక్ష్మి పిలుపునిచ్చారు. దిగువ పేర్కొన్న అక్కౌంట్స్ ద్వారా సహాయం అందించాలన్నారు. అకౌంట్ పేరు: కలెక్టర్, జిల్లా మేజిస్ట్రేట్, గుంటూరు జిల్లా అకౌంట్ నెంబర్: 33260919895, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ ఐడీఎఫ్‌సీ 0081061 పేరుతో చెక్కులు, డీడీలు నేరుగా పంపవచ్చని, దాతల వివరాలు ప్రకటిస్తామని తెలిపారు.


సీఎంకు చెక్కును అందజేస్తున్న శైలజ

ప్రమాదకరంగా నది రిటైనింగ్ వాల్


వరద ఉధృతికి కూలిన రిటైనింగ్ వాల్

తాడేపల్లి టౌన్, సెప్టెంబరు 4: గత నాలుగు రోజులుగా ప్రకాశం బ్యారేజి దిగువకు భారీగా వరదనీరు ప్రవహించడంతో సీతానగరం డౌన్‌లో నది వెంబడి ఉన్న రిటైనింగ్ వాల్ ప్రమాదకర స్థితికి చేరింది. నీటికి నానిపోయి ఇప్పటికే మూడు చోట్ల 10 అడుగుల మేర కూలిపోయింది. మరో రెండు చోట్ల పూర్తిగా పగుళ్ల వచ్చి కూలడానికి సిద్ధంగా ఉంది. వరదనీరు చూసేందుకు బ్యారేజి దిగువకు సందర్శకుల తాకిడి పెరిగింది. వారు ఆ వాల్‌పై కూర్చుంటూ ఫొటోలు, సెల్ఫీలు తీసుకుంటున్నారు. ఏదైనా జరగరాని ఘటనలు జరిగితే కృష్ణానది వరద ఉధృతిలో పడి ప్రాణనష్టం జరిగే అవకాశం ఉంది. పోలీసు సిబ్బంది అక్కడ బారికేడ్లు పెట్టి హెచ్చరికలు జారీ చేసినా సందర్శకులు పెడచెవిన పెడుతున్నారు. సంబంధిత నీటిపారదల శాఖ అధికారులు రిటైనింగ్ వాల్ పటిష్టతకు చర్యలు తీసుకోవాలని సీతానగరం వాసులు కోరుతున్నారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

- విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.05 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	114, 122,133
చికెన్ విత్ స్కిన్	216.00
చికెన్ స్కిన్ లెస్	226.00

మాజీ మంత్రి రోజా కళ్లున్న కబోది


కత్తెర హెన్రీ క్రిస్టినా

గుంటూరు సిటీ, సెప్టెంబరు 4 : సీఎం చంద్రబాబు నాయుడు కార్యక్షేత్రంలో ఉండి విజయవాడలో సహాయ కార్యక్రమాలు ముమ్మరంగా చేపడుతుంటే మాజీ మంత్రి రోజా నోరు పారేసుకోవటం దుర్మార్గం అని జడ్పీ ఛైర్ పర్సన్ కత్తెర హెన్రీ క్రిస్టినా అన్నారు. కూటమి ప్రభుత్వం జరుగుతున్న మంచిని చూడలేని కళ్లున్న కబోది రోజా అని ఆమె విమర్శించారు. సహాయక చర్యలపై రోజా ఇష్టానుసారంగా మాట్లాడిన నేపథ్యంలో జడ్పీ ఛైర్ పర్సన్ కత్తెర హెన్రీ క్రిస్టినా విలేకరులతో మాట్లాడారు. 74 ఏళ్ల వయస్సులో విరామం లేకుండా ప్రజలందరికీ సాయం అందాలని, విజయవాడ తిరిగి యథాస్థితికి చేరుకోవాలని సీఎం చంద్రబాబు నాయుడు, మంత్రులు, ఎమ్మెల్యేలు సహాయ సహకారాలు అందిస్తుంటే రోజా ఎక్కడో కూర్చుని ముఖ్యమంత్రిని, డిప్యూటీ సీఎంను, ప్రభుత్వాన్ని విమర్శిస్తూ ఒక వీడియో రిలీజ్ చేయటం విడ్డూరంగా ఉందన్నారు. ఒక ఆహార ప్యాకెట్ కూడా అందించలేని వైసీపీ అధ్యక్షుడు జగన్, రోజా కూటమి ప్రభుత్వాన్ని విమర్శించడం దారుణ మన్నారు. ప్రకృతి విపత్తులు అకస్మాత్తుగా సంభవిస్తాయనీ, వాటిని ఎవరు ఆపలేరు అనే విషయాన్ని రోజా తెలుసుకోవాలన్నారు. బుడమేరుకు గేట్లు లేవనే విషయం మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికి తెలియకపోవడం ఆశ్చర్యంగా ఉందన్నారు.

44,704 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు బుధవారం 46,675 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా అందులో 44,704 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి ఐ వెంకటేశ్వరరెడ్డి తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 23,540 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర	వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ			**ఏసీ కామన్ వెరైటీ**		
334	7500	15700	334	8000	15500
నెంబరు. 5	8000	13500	నెంబరు. 5	9000	12000
273	10000	12000	273	11000	11000
341	8600	14000	341	9000	16200
4884	9200	15000	4884	11000	13000
సూపర్ 10	-	-	సూపర్ 10	--	--
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ			**ఏసీ స్పెషల్ వెరైటీ**		
తేజ	7500	18600	తేజ	8000	18500
బ్యాడిగి	8500	13700	బ్యాడిగి	8500	12700
దేవనూరు డీలక్స్	10000	13800	దేవనూరు డీలక్స్	9500	15000
తెల్లకాయలు	4500	11500	తెల్లకాయలు	5500	10000

నిత్యావసరాల కిట్లను పరిశీలించిన కలెక్టర్



గుంటూరు సిటీ, సెప్టెంబర్ 4 : నందివెలుగు రోడ్డులో ఉన్న పౌర సరఫరాల గిడ్డంగిలో వరద బాధిత కుటుంబాలకు పంపిణీ చేసేందుకు సిద్ధం చేస్తున్న నిత్యావసర సరకుల కిట్లను బుధవారం జిల్లా కలెక్టర్ ఎస్. నాగలక్ష్మి పరిశీలించారు. తాడికొండ, గుంటూరు అర్బన్, గుంటూరు రూరల్, మంగళగిరి, తాడేపల్లి మండలాలకు చెందిన 2700 కుటుంబాలకు ఈ నిత్యావసర సరకుల కిట్లను అందజేయనున్నారు. ఒక్కొక్క కిట్‌లో 25 కిలోల బియ్యం, ఒక కేజీ చొప్పున కందిపప్పు, పంచదార, పామాలిన్ ఆయిల్, బంగాళాదుంప, ఉల్లిపాయలను ఒక కిట్‌గా చేసి కుటుంబానికి పంపిణీ చేయడానికి చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వ నిబంధనల మేరకు మత్స్యకారులు, నేత కార్మికుల కుటుంబాలకు 50 కేజీల బియ్యం అందించాల్సి ఉందన్నారు. తెనాలి, దుగ్గిరాల, కొల్లిపర మండలాలకు సంబంధించి తెనాలి పౌర సరఫరాల శాఖ గిడ్డంగి నుంచి నిత్యావసర సరకులను వరద బాధితుల సహాయార్థం పంపిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా నందివెలుగు రోడ్డులోని ఎంఎస్ఎల్ గోడౌన్‌లో ఉన్న రైస్ నాణ్యతను, తూకాన్ని, ప్యాకింగ్ విధానాన్ని పరిశీలించారు. జిల్లా పౌర సరఫరాల సంస్థ జనరల్ మేనేజర్ లక్ష్మీ, గుంటూరు తూర్పు మండల తహసీల్దార్ నగేష్ పాల్గొన్నారు.

13 న జడ్పీ స్టాడింగ్ కమిటీల సమావేశం

గుంటూరు సిటీ, సెప్టెంబరు 4 : ఉమ్మడి జిల్లా పరిషత్ స్టాడింగ్ కమిటీల సమావేశం ఈ నెల 13న ఏర్పాటు చేశారు. ఉదయం 10.30 గంటల నుండి 12.30 గంటల వరకు ఈ సమావేశాలు వేరు వేరు గా జరగనున్నాయి. సమావేశాల నిర్వహణ సమాచారాన్ని జడ్పీ సీఈవో వసంతారాయుడు జిల్లా కలెక్టర్ కు బుధవారం లేఖ ద్వారా తెలిపారు.

ముగ్గురి ఏవోలపై అభియోగాల నమోదు

గుంటూరు, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ప్రైవేటు ఫెర్టిలైజర్స్ డీలర్లను ప్రోత్సహించారన్న ఫిర్యాదుల్లో ప్రాథమిక ఆధారాలున్నట్లు నిర్ధారణ కావడంతో ఉమ్మడి గుంటూరు జిల్లాలో విధులు నిర్వహించిన ముగ్గురు వ్యవసాయ అధికారులపై ప్రభుత్వం విచారణ నిర్వహించాలని నిర్ణయించింది. వీరిలో ఒక జాయింట్ డైరెక్టర్, అసిస్టెంట్ డైరెక్టర్, మండల వ్యవసాయాధికారి ఉన్నారు. ఫెర్టిలైజర్స్‌ని రైతు భరోస కేంద్రాలకు తెప్పించడం, అక్కడ నుంచి రైతులకు విక్రయించే విషయంలో ముగ్గురు అధికారులు నిర్లక్ష్యం వహించారు. దీని వలన రైతులు ప్రైవేటు డీలర్ల వద్దకు వెళ్లి అధిక ధరకు ఫెర్టిలైజర్స్‌ని కొనుగోలు చేయాల్సిన పరిస్థితి వచ్చిందని అప్పట్లో ఫిర్యాదులు రావడంతో ఈ మేరకు బుధవారం వ్యవసాయ శాఖ స్పెషల్ చీఫ్ సెక్రెటరీ బుడితి రాజశేఖర్ జారీ చేసిన ఉత్తర్వులు ఆ శాఖలో చర్చనీయాంశంగా మారాయి. రేపల్లె నియోజకవర్గంలోని నిజాంపట్నం మండలం రైతు భరోస కేంద్రాల్లో రైతులకు అవసరమైన ఫెర్టిలైజర్స్ స్టాక్‌ని పొజిషన్ చేయడంలో అప్పటి ఉమ్మడి గుంటూరు జిల్లా అధికారులు నిర్లక్ష్యం వహించారు. అప్పటి మండల వ్యవసాయాధికారి ఎం చంద్రశేఖర్, అసిస్టెంట్ డైరెక్టర్ ఎన్ ఉషారాణి, జాయింట్ డైరెక్టర్ ఎం విజయభారతిపై అభియోగాలను నమోదు చేసి విచారణ చేపట్టాలని నిర్ణయించింది. .

కొనసాగిన విజిలెన్స్ తనిఖీలు

గుంటూరు, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డులో వైసీపీ ప్రభుత్వ హయాంలో జరిగిన అక్రమాలపై విచారణ చేపట్టిన విజిలెన్స్ అధికారులు రెండో రోజు తనిఖీలు కొనసాగించారు. బుధవారం విజిలెన్స్ సీఐ ఏ శ్రీహరిరావు, తహసీల్దార్ నాగమల్లేశ్వరరావు, ఇతర సిబ్బంది యార్డు పరిపాలన భవనంలో ఫైళ్లను స్వాధీనం చేసుకొన్నారు. వాటన్నింటిని కలెక్టరేట్ ప్రాంగణంలోని ప్రాంతీయ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి కార్యాలయానికి తరలించారు. ఆయా ఫైళ్లను క్షుణ్ణంగా పరిశీలించి, అధికారులు, వ్యాపారస్థులు, హమాలీలు, వేమెన్ల నుంచి స్టేట్‌మెంట్‌లు రికార్డు చేసి ఆ తర్వాత ప్రభుత్వానికి నివేదిక పంపనున్నట్లు విజిలెన్స్ వర్గాలు తెలిపాయి.

బాపట్ల వార్తలు

◆ బాపట్ల ◆ వేమూరు ◆ రేపల్లె

ముంపు బాధితులకు ఎమ్మెల్యే నరేంద్రవర్మ సాయం



బాధితులకు ఆహార ప్యాకెట్‌లు అందజేస్తున్న ఎమ్మెల్యే నరేంద్రవర్మ

బాపట్ల, సెప్టెంబరు 4 : వరదలకు తల్లడిల్లిపోతున్న విజయవాడలోని 64వ డివిజన్ కండ్రిక ప్రాంతంలో బాపట్ల ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ రెండు రోజులుగా సేవలందిస్తున్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఆదేశాల మేరకు నరేంద్రవర్మ ఆ ప్రాంతంలో పర్యటించి ప్రతికుటుంబానికి ఆహార ప్యాకెట్‌లు అందజేశారు. చిన్నారులకు బిస్కెట్ ప్యాకెట్‌లు పంపిణీ చేశారు. పరిస్థితి పరిశీలించి ఇబ్బందిపడుతున్న వారిని పునరావాస కేంద్రాలకు వెళ్లాలని కోరారు. మునిగిపోయిన ఇళ్ల వద్దకెళ్ళి స్వయంగా ఆహార ప్యాకెట్‌లు, పాలు, వాటర్‌బాటిళ్ళు పంపిణీ చేశారు. కాలనీ చివరి వరకు వెళ్ళి బాధితుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు.

వరద బాధితులకు తెలుగు మహిళల సేవలు



వరదబాధితులకు సేవలందిస్తున్న తెలుగు మహిళలు

బాపట్ల, సెప్టెంబరు 4 : తెలుగుదేశం పార్టీ మహిళా నాయకులు బుధవారం కొల్లూరు మండలంలోని వరద బాధితులకు సేవలందించారు. టీడీపీ పార్లమెంట్ మహిళా ప్రధాన కార్యదర్శి పల్లం సరోజినీ మహిళలతో కలిసి వెళ్ళి వరదలో చిక్కుకొని ఇబ్బందులు పడుతున్న కుటుంబాలను పరామర్శించి ఆహార ప్యాకెట్‌లు, వాటర్ బాటిల్స్ అందజేసి ప్రభుత్వం అన్నివిధాలా ఆదుకుంటుందని భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు చెన్నుపాటి హైమావతి, పార్లమెంట్ కార్యదర్శి కూచిపూడి ఝాన్సీ రాణి, మండలపార్టీ మహిళా అధ్యక్షురాలు నాగభూషణమ్మ తదితరులు ఉన్నారు.

మంత్రి గొట్టిపాటి ఉదారత

అమరావతి: మంత్రి గొట్టిపాటి రవికుమార్ వరద బాధితులకు బాసటగా నిలిచారు. వరదలో చిక్కుకున్న విజయవాడ రాజరాజేశ్వరి పేటకు 5 వేల లీటర్ల పాలు, 10 వేల మంచినీళ్ల బాటిళ్లు అద్దంకి నుంచి బుధవారం పంపారు.

వరద బాధితులకు జిల్లెళ్ళమూడి అమ్మవారి అన్నప్రసాదం

కొల్లూరు వరద బాధితులకు బాపట్ల మండలం జిల్లెళ్ళమూడి అమ్మవారి అన్నప్రసాదాన్ని బుధవారం పంపించారు. శ్రీ విశ్వజననీ పరిషత్ వారు 5 వేల ఆహార ప్యాకెట్‌లను ప్రత్యేకంగా తయారు చేయించి వాహనాలలో తీసుకెళ్ళారు. జాయింట్‌కలెక్టర్ సూచనల మేరకు పెసరలంక, గాజులలంక, పెదలంక, చింతలంక, శుద్ధలంక, చిరువల్లంక గ్రామాలలో పర్యటించి పంపిణీ చేశారు. విశ్వజననీ పరిషత్ సభ్యులు, మాతృశ్రీ ఓరియంటల్ కళాశాల విద్యార్థులు పాల్గొని సేవలందించారు.

కేశవ కూల్‌డ్రింక్స్ ఆహార ప్యాకెట్ పంపిణీ

కొల్లూరు మండలంలో కృష్ణానది పరివాహక ప్రాంతాలలో ముంపు బాధితులకు బాపట్ల కేశవ కూల్‌డ్రింక్స్ వారు ఆహార ప్యాకెట్‌లు తయారు చేయించి బుధవారం పంపించారు. కేశవ కూల్‌డ్రింక్స్ నిర్వాహకులు పాపినేని రాధాకృష్ణ, ప్రసాద్‌లు ఏర్పాటు చేసిన ఈ ఆహార ప్యాకెట్‌లను ప్రత్యేక వాహనంలో తీసుకెళ్లి పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు గొలపల శ్రీనివాసరావు, కె.భాస్కరరాజు, జేవీ ప్రసాద్, తిరుపతిరావు, ధర్మేంద్రరెడ్డి, నాగరాజు ఉన్నారు.

వరద బాధితులకు బిస్కెట్‌లు, యాపిల్స్ పంపిణీ

కర్లపాలెం, సెప్టెంబరు 4 : తుఫాన్ కారణంగా వరదకు గురై తీవ్ర ఇబ్బందులు పడుతున్న వెల్లటూరు, లంకేవానిదిబ్బ వరద బాధితులకు కర్లపాలెం వాసవీ క్లబ్, ఆర్యవైశ్య సంఘం వారు బుధవారం 3 వేల యాపిల్‌లు, 1000 బిస్కెట్ ప్యాకెట్‌లు, 1000 వాటర్ బాటిల్స్‌ను పంపిణీ చేశారు. కర్లపాలెం నుంచి వాసవీక్లబ్, ఆర్యవైశ్య సభ్యులు యాపిల్ పండ్లు, బిస్కెట్, వాటర్ బాటిళ్ళను ఆటోలో తీసుకొని వెళ్ళి బాధితులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో బొమ్మిశెట్టి రాంబాబు, పానుగంటి సురేష్‌బాబు, మెడతాటి గిరిధర్, తూనుగుంట్ల సుబ్బారావు, మద్ర రమేష్, గంగిశెట్టి శ్రీను, తూనుగుంట్ల సత్యనారాయణ తదితరులు ఉన్నారు.

ఆహారం పంపిణీ చేసిన జనసేన నాయకులు

ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్‌ల పిలుపుమేరకు వరదబాధితులకు కర్లపాలెం మండలం జనసేన పార్టీ అధ్యక్షులు గొట్టిపాటి శ్రీకృష్ణ ఆధ్వర్యంలో నాయకులు బుధవారం ఆహార పొట్లాలను పంపిణీ చేశారు. కొల్లూరు మండలంలోని లంక గ్రామాలు ముంపునకు గురికాగా ఆ గ్రామాలలో విద్యుత్ స్తంభాలను పునఃనిర్మాణం చేస్తున్న కూలీలకు, అగ్నిమాపక సిబ్బంది, కొంతమంది సాధారణ ప్రజానీకానికి ఆహార ప్యాకెట్‌లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు మాడసాని బాలాజి, గొట్టిపాటి శ్రీకృష్ణ, కూనపరెడ్డి శ్రీనివాసరావు, నీలిశారాబంధి తదితరులు ఉన్నారు.

ముస్లింలు ఆహార పొట్లాల పంపిణీ

చెరుకుపల్లి, సెప్టెంబరు 4 : వరద గ్రామాలలోని ప్రజలకు ప్రతి ఒక్కరూ సహాయ సహకారాలు అందించాలని రెవెన్యూ శాఖామంత్రి అనగాని సత్యప్రసాద్ ఇచ్చిన పిలుపునకు కనగాల ముస్లింలు స్పందించారు. 3 వేల ఆహార పొట్లాలను పెనుమూడి వద్ద రేపల్లె తహసీల్దార్‌కు అందించారు.

యడ్లపల్లి తెలుగు యువత ఆధ్వర్యంలో...

చుండూరు, సెప్టెంబరు 4 : యడ్లపల్లి తెలుగు యువత ఆధ్వర్యంలో బుధవారం భట్టిప్రోలు, కొల్లూరు మండల వరద బాధిత గ్రామాలకు ఆహార పదార్థాలను అందించారు. రెండు వేల మందికి సరిపడే విధంగా యడ్లపల్లిలో ఆహార పదార్థాలను ప్యాకింగ్ చేసి రెండు వాహనాల్లో తెలుగు యువత గ్రామస్తులు కలసి అక్కడి గ్రామాలకు పంపించారు. యువత స్ఫూర్తిని తహసీల్దార్ దేవిశెట్టి మల్లికార్జునరావు అభినందించారు.

అంతా కృష్ణార్పణం...

- వరద ముంపులోనే వాణిజ్య పంటలు
- రూ.కోట్లలో పంట నష్టం
- ఆదుకోవాలని రైతుల వేడుకోలు



భట్టిప్రోలు మండలం వెల్లటూరు లంకల్లో వరద ముంపులోనే పసుపు పైరు

కొల్లూరు, సెప్టెంబరు 4 : కృష్ణానది వరద బీభత్సానికి వాణిజ్య పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయి. వరద కొంత మేర తగ్గుముఖం పట్టినప్పటికీ కొల్లూరు, భట్టిప్రోలు మండలాల్లోని లంక గ్రామాల్లోని రైతులు సాగు చేసిన వాణిజ్య పంటలు అరటి, కంద, పసుపు, బొప్పాయి, కూరగాయ పండ్ల తోటలు ఇంకా వరద ముంపులోనే ఉన్నాయి. పొలాల్లో నిలిచిన నీరు బయటకు వెళ్లేందుకు మరో మూడు నాలుగు రోజులు పడుతుందని రైతులు చెబుతున్నారు. ఇన్ని రోజులు నీటిలో వాణిజ్య పంటలు నానిఉండటంతో దుంప కుళ్లిపోయి మొక్కలు వాటి అంతట అవే దెబ్బతినిపోతాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రెండు మండలాల పరిధిలోని సుమారు 20 వేలకు పైగా ఎకరాలలో రైతులు కోట్లాది రూపాయలతో పెట్టుబడులు పెట్టి అరటి, కంద, పసుపు వంటి వాణిజ్య పంటలు సాగు చేపట్టారు. ఒక్కొక్క రైతు లక్షలాది రూపాయలు పంటలపై పెట్టిన పెట్టుబడులు కృష్ణార్పణం అయ్యాయి. ప్రభుత్వం పంట నష్టం అంచనాలు వేసి ఆదుకోవాలని లేనిపక్షంలో తామంతా అప్పులపాలు అవుతామని రైతన్నలు కన్నీటి పర్యంతమవుతున్నారు.

జలాశయాలను తలపిస్తున్న పంట భూములు

చుండూరు, సెప్టెంబరు 4 : మండలంలోని పలు గ్రామాల్లో పంట భూములు జలాశయాలను తలపిస్తున్నాయి. మోదుకూరు, కారుమూరు వారిపాలెం, పెదగాదెలవర్రు, చినగాదెలవర్రు, ఆలపాడు గ్రామాల్లోని మాగాణి భూముల్లో చేరిన వరద నీరు గత నాలుగు రోజుల నుంచి బయటకు వెళ్ళే మార్గం లేకపోవడంతో వేసిన నాట్లు మునిగిపోయి జలాశయాలుగా కనబడుతున్నాయి. ఇరిగేషన్ శాఖ అధికారులు త్వరిత తగిన పొలాల్లోని నీటిని మళ్ళించే ఏర్పాట్లు యుద్ధ ప్రాతిపదికన చేపట్టాలని కోరుతున్నారు.

చుండూరు-మోదుకూరు మధ్య రాకపోకలకు అంతరాయం

చుండూరు-మోదుకూరు మధ్య రహదారిపై రాకపోలకు అంతరాయం ఏర్పడింది. తుంగభద్ర డ్రెయిన్ ఉధృతికి రహదారి మార్గం తెగిపోవడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ఈ మార్గంలో ఎలాంటి వాహనాలను నడపవద్దని ఈ గ్రామాలకు వెళ్ళే వాళ్ళు ప్రత్యామ్నాయ మార్గాలు చూసుకోవాలని తహసీల్దార్ దేవిశెట్టి మల్లిఖార్జునరావు తెలిపారు.





ఒండ్రుమట్టితో నిండిపోయిన కంద పైరు, దెబ్బతిన్న బొప్పాయి తోట



జలాశయాలను తలపిస్తున్న పంట భూములు

తగ్గిన కృష్ణమ్మ వరద

- ఊపిరిపీల్చుకుంటున్న తీర ప్రాంత వాసులు
- 8 వేల ఎకరాలలో వాణిజ్య పంటల నష్టం

రేపల్లె, సెప్టెంబరు 4 : కృష్ణమ్మ కరుణించటంతో వరద తగ్గుముఖం పట్టింది. దీంతో తీర ప్రాంతంలోని రేపల్లె నియోజకవర్గంలోని పెనుమూడి, పల్లెపాలెం, మైనేనివారిపాలెం, బొబ్బర్లంక, లంకేవానిదిబ్బ గ్రామాల కరకట్ట వెంట ఉన్న గ్రామాల్లోని ప్రజలు సామాగ్రిని తీసుకుని గృహాలకు పయనమయ్యారు. గృహాలు కోల్పోవటంతో ఎక్కడ ఉండాలా అని ఆలోచనలో పడ్డారు. రూరల్ మండలంలోని పెనుమూడి పల్లెపాలెంలో 60 గృహాలు నీట మునిగి మట్టి కరిగిపోయి గుంజలు విరిగి పోవటంతో నేలవాలాయి. ప్రభుత్వమే మమ్ములను ఆదుకోవాలంటూ ప్రజలు విన్నవించుకుంటున్నారు. కరకట్ట వెంట ఉన్న పెనుమూడి,మైనేనివారిపాలెం, లంకేవానిదిబ్బ ఎస్‌టికాలనీ,భట్టిప్రోలుమండలం ఓలేరు పల్లెపాలెం పూర్తిగా గృహాలు దెబ్బతిన్నాయి. అధికారులు మాత్రం నామమాత్రంగా వచ్చి వెళుతున్నారే తప్ప తమ గోడు పట్టించుకున్నవారేలేరని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మాడిపోయిన వాణిజ్య పంటలు

తీర ప్రాంతంలో కృష్ణానది వరద ఉధృతి తగ్గటంతో నాలుగురోజులుగా నీటిలో నానుతున్న వాణిజ్య పంటలు చీకిపోవటంతో పంట పూర్తిగా నష్టం వాటిల్లిందని రైతులు బోరున విలపిస్తున్నారు. రేపల్లె, భట్టిప్రోలు మండలాలలో 8 వేల ఎకరాలకు పైగానే కంద, పసుపు, అరటి, వంగ, దొండ, దోస, మిరప పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయి. నష్టపోయిన పంటలను ప్రభుత్వం అంచనా వేసి ఆర్థికంగా ఆదుకోవాలని విత్తనాలను ఎరువులను ఉచితంగా అందజేసేలా చర్యలు తీసుకోవాలని రైతులు విన్నవించుకుంటున్నారు. కృష్ణమ్మ ఉగ్రరూపం దాల్చటంతో వరద తాకిడికి గృహమంతా నీటిలో నాని నేలపాలైపోయిందని సామాన్లు అంతా బురదమయంగా మారిపోయాయని మమ్మల్ని ఆదుకునేది ఎవరంటూ పెనుమూడికి చెందిన వజ్రమ్మ కన్నీటిపర్యంతమైంది. వరద పోటెత్తటంతో ఇల్లంతా నేలమట్టమయ్యిందని ప్రస్తుతం ఇల్లు కట్టుకోవాలంటే రూ.2 లక్షలు పెట్టుకోవాల్సిన పరిస్థితి నెలకొందని పెనుమూడికి చెందిన లక్ష్మి బోరున విలపించింది.



రావిఅనంతవరం గ్రామం సమీపంలో నీటిలో నానుతున్న అరటి తోటలు



బాపట్ల మండలంలో వరదనీరు బయటకు వెళుతుండటంతో బయటపడుతున్న పైర్లు

పొలాలలో తగ్గుతున్న నీరు... బయటపడుతున్న మొక్కలు

బాపట్ల, సెప్టెంబరు 4 : భారీ వర్షాలతోపాటు వరదనీరు వచ్చి చేరటంతో నియోజకవర్గంలోని బాపట్ల, కర్లపాలెం, పిట్టలవానిపాలెం మండలాలలోని పొలాల్లో చేరిన నీరు బుధవారం ఉదయం నుంచి బయటకెళ్ళటం ప్రారంభమైంది. నిన్నటి వరకు డ్రైనేజిలు ఉధృతంగా ప్రవహించటం వల్ల ఇక్కడ పొలాలలో నీరు బయటకెళ్ళలేదు. ప్రస్తుతం డ్రైనేజిలలో ఎగువప్రాంతాలు నుంచి వచ్చే వరదనీరు తగ్గుముఖం పట్టటంతో ఈప్రాంత వ్యవసాయ భూములలో నిలిచిన నీరు బయటకు కదిలింది. దీంతో మెరకభూములలో మొక్కలు బయటపడుతున్నాయి. రైతులు నీటిని బయటకు పంపించే పనిలో నిమగ్నమయ్యారు. పల్లపు ప్రాంతాలలోని పొలాల్లో నిలిచిన నీరు మాత్రం ఇంకా బయటకు రావటంలేదు. జమ్ములపాలెం, నరసాయపాలెం, కంకటపాలెం ప్రాంతాలలో నీరు బయటకొస్తుండగా అప్పికట్ల, గోపాపురం, మూలపాలెం, ఈతేరు పరిసరప్రాంతాలలోని పొలాల్లో నీరు మాత్రం నెమ్మదిగా బయటకు కదులుతుంది. వ్యవసాయాధికారులు మాత్రం ముదురు పైర్లు కొంత పనికొస్తాయని లేత పైర్ల పరిస్థితి చెప్పలేమంటున్నారు. రైతులు మాత్రం ఏదో ఒక విధంగా పైరును కాపాడుకునే ప్రయత్నంలో ఉండిపోయారు. ఇప్పటికే ఎక్కువ మొత్తంలో పెట్టుబడిపెట్టామని, పైరు పనికిరాకుంటే మరలా అప్పులు చేయాలని రైతులు ఆవేదన చెందుతున్నారు.

చవితి ఉత్సవాలకు సింగిల్ విండో విధానం : ఎస్పీ

బాపట్ల, సెప్టెంబరు 4 : వినాయకచవితి ఉత్సవాలలో భాగంగా విగ్రహాల ఏర్పాటుకు తప్పనిసరిగా అనుమతి తీసుకోవాలని ఎస్పీ తుషార్ డూడీ తెలిపారు. ఈవిషయమై బుధవారం ఆయన మాట్లాడుతూ సింగిల్‌విండో విధానంతో అనుమతులు సులభతరం చేశామన్నారు. 7995095800 మొబైల్ నెంబర్‌కు వాట్సప్ ద్వారా హెచ్‌ఐ అనే సందేశం పంపినా లేదా వైబ్‌సైట్ లింకు ద్వారా అనుమతులు కోసం దరఖాస్తు చేసుకున్నా అనుమతులు ఇవ్వబడతాయన్నారు. ఈనెల 7వ తేదిన వినాయకచవితి పండుగ సందర్భంగా పందిళ్ళు, మండపాలలో విగ్రహాలు ఏర్పాటు చేసుకొని ఉత్సవాలు జరుపుకునేవారు తప్పనిసరిగా నిబంధనలు పాటిస్తూ జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

తీరంలో రెండు రోజులు కవాచ్ ఆపరేషన్

బాపట్లరూరల్, సెప్టెంబరు 4 : బాపట్ల-సూర్యలంక తీరంలో రెండు రోజులుపాటు కోస్టల్ సెక్యూరిటీ ఎక్సైజ్ సాగర్ కవాచ్ ఆపరేషన్‌ను మెరైన్ పోలీసులు నిర్వహించనున్నారు. ఈసందర్భంగా మెరైన్ ఉన్నతాధికారులు బుధవారం మెరైన్ పోలీసులకు సూచనలను చేశారు. బాపట్ల మండలం సూర్యలంక పోలీసుస్టేషన్‌ను రాష్ట్రంలోని విజయనగరం, శ్రీకాకుళం, విశాఖపట్టణం, తూర్పు గోదావరి, పశ్చిమగోదావరి, కృష్ణా, బాపట్ల, ప్రకాశం, నెల్లూరు జిల్లాలను కవర్ చేస్తూ ఈ ఆపరేషన్ నిర్వహించటం జరుగుతుందని తెలిపారు. ఈ ఆపరేషన్‌కు సంబంధించి బోట్ పెట్రోలింగ్ పార్టీలు, చెక్‌పోస్టులు, ల్యాండింగ్‌పాయింట్‌లు, పికెట్‌లు, మొబైల్ సర్వైలెన్స్ పార్టీలతో కూడిన మాక్ ఆపరేషన్ నిర్వహించబడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మెరైన్ సీఐ పాల్గొన్నారు.

విద్యార్థుల పురోగతిపై సమీక్ష

పిట్టలవానిపాలెం, సెప్టెంబరు 4 : పిట్టలవానిపాలెం ప్రాథమికోన్నత పాఠశాలను మహారాష్ట్రలోని ఔరంగబాద్‌కు చెందిన టిఎఆర్‌ఎన్‌కు సంబంధించిన సతీష్‌షిండే బుధవారం సందర్శించి గత ఏడాది, ప్రస్తుతం సంవత్సరంలో విద్యార్థుల బేస్‌లైన్, మిడిల్‌లైన్, ఎన్డ్‌లైన్‌కు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో ఎంఈవో-2 కె.రాజారత్నం, పాఠశాల ఉపాధ్యాయని, ఉపాధ్యాయులు కె.సుమతి, ఎండీ ప్రసన్నలక్ష్మి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. అదేవిధంగా మండలంలోని జివిఎస్‌పాలెం ప్రాథమిక పాఠశాలలను సందర్శించి ఆయా సమాచారాన్ని ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి బీజేపీ కృషి

- మాజీ ఎమ్మెల్సీ, బీజేపీ నాయకుడు అన్నం సతీష్ ప్రభాకర్

బాపట్ల, సెప్టెంబరు 4 : ప్రజా సమస్యల పరిష్కారానికి భారతీయ జనతాపార్టీ విశేష కృషి చేస్తుందని మాజీ ఎమ్మెల్సీ బీజేపీ నాయకుడు అన్నం సతీష్ ప్రభాకర్ అన్నారు. పట్టణంలోని పటేల్‌నగర్‌లో బుధవారం బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించారు. జిల్లా పార్టీ అధ్యక్షుడు యార్లగడ్డ లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో ప్రారంభించిన ఈ కార్యక్రమానికి అన్నం సతీష్ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ ప్రతి ఒక్కరు బీజేపీ సభ్యత్వం పొందాలన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే దారా సాంబయ్య, బీజేపీ యువమోర్చా రాష్ట్ర కోశాధికారి బి.కృష్ణ చైతన్య, పార్టీ పట్టణ అధ్యక్షుడు మామిడి రమేష్‌కుమార్, కొత్రా రామకృష్ణ, జగన్నాధశాస్త్రి, అనీల్‌బాబు, బి.బాబునాగేంద్ర పాల్గొన్నారు.



బీజేపీ సభ్యత్వం తీసుకుంటున్న మాజీ ఎమ్మెల్సీ అన్నం సతీష్ ప్రభాకర్

పర్యావరణ పరిరక్షణపై అవగాహన

బాపట్లరూరల్, సెప్టెంబరు 4 : బాపట్ల ఇంజనీరింగ్ కళాశాలలో రానున్న వినాయక చవితి పండుగ సందర్భంగా పర్యావరణాన్ని పరిరక్షణపై అవగాహన కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. పర్యావరణం పరిరక్షించే ఉద్దేశ్యంలో భాగంగా బాపట్ల ఇంజనీరింగ్ కళాశాలలో టీమ్‌సిసిఎ, ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్స్ ఆధ్వర్యంలో మట్టి వినాయకుని తయారీ పోటీలు, మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. బాపట్ల ఎడ్యుకేషన్ సొసైటీ అధ్యక్షుడు ముప్పలనేని శ్రీనవాసరావు మాట్లాడుతూ పర్యావరణ సమతుల్యాన్ని, నాణ్యతను పరిరక్షించుకుంటూ దేశపురోగాభివృద్ధి సాధన ప్రక్రియ కొనసాగించాలని తెలిపారు. పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు ప్రశంసపత్రాలు, నగదు బహుమతిని అందజేశారు. ఈ కార్యక్రమంలో సెక్రటరి మానం నాగేశ్వరరావు, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ షేక్ నజీర్, కళాశాల డీన్ స్టూడెంట్స్ ఎఫైర్స్ ప్రొఫెసర్ డి.నిరంజన్‌బాబు, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ పౌష్టికాహారం తీసుకోవాలి

చెరుకుపల్లి, సెప్టెంబరు 4 : ప్రభుత్వం అంగన్‌వాడీల ద్వారా అందిస్తున్న పౌష్టికాహారాన్ని బాలింతలు, గర్భిణులు తప్పక పొందాలని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ ధనలక్ష్మి అన్నారు. బుధవారం ఊచావారిపాలెం అంగన్‌వాడీ కేంద్రంలో జరిగిన పౌష్టికాహార వారోత్సవాలలో ఆమె పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఊచా శ్రీనివాసరావు, అంగన్‌వాడీ కార్యకర్తలు ఊచా బసవమ్మ, ఉప్పె బోగేశ్వరి, వాకా రాజ్యలక్ష్మి, దోమా శివపార్వతి పాల్గొన్నారు.

వరద బాధితులకు రూ.లక్ష ఆర్థిక విరాళం

రేపల్లె, సెప్టెంబరు 4 : నిజాంపట్నం మండలం బొర్రావారిపాలెం గ్రామానికి చెందిన బొర్రా రమేష్ వరద బాధితులు సహాయం చేయాలనే ఉద్ధేశ్యంతో రూ.లక్ష ఆర్థికసాయాన్ని రాష్ట్ర రెవెన్యూ శాఖా మంత్రి అనగాని సత్యప్రసాద్‌కు బుధవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కేసన సోమయ్య, ఎంపీటీసీ సురేంద్ర, లుక్కా సోమేష్, కేసన పగిడియ్య స్వామి, బి.రామారావు, శ్రీరామ్మూర్తి, మోర్ల రమేష్‌బాబు, చింతా సింహం తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న సహాయక శిబిరం

చుండూరు, సెప్టెంబరు 4 : మండలంలో భారీ వర్షాలకు దెబ్బతిన్న పూరిగుడిసెల్లోని పేద ప్రజలకు నాలుగు రోజుల నుంచి ఆహారం, వైద్య సదుపాయాలు అందిస్తున్నట్లు తహసీల్దార్ దేవిశెట్టి మల్లికార్జునరావు తెలిపారు. యడ్లపల్లి జడ్‌పి స్కూల్‌లో ఈ వైద్య శిబిరం కొనసాగుతుందని, సుమారు 300 మంది దుండిపాలెం, యడ్లపల్లి, వలివేరు, మున్నంగివారిపాలెం గ్రామాలకు చెందిన వీరు ఈ శిబిరంలో తలదాచుకుంటున్నారని ఆయన తెలిపారు. గ్రామాల్లో అంటు వ్యాధులు ప్రబలకుండా పారిశుధ్య చర్యలను చేపట్టినట్లు ఆయన తెలిపారు.

కృష్ణమ్మ ఉగ్రరూపానికి ముక్తేశ్వరాలయం ధ్వంసం



ఆలయ కమిటీవారితో మాట్లాడుతున్న మంత్రి అనగాని సత్యప్రసాద్

రేపల్లె, సెప్టెంబరు 4 : దక్షిణకాశిగా పేరొందిన మండలంలోని మోర్తోట ముక్తేశ్వర స్వామి దేవాలయం కృష్ణమ్మ ఉగ్రరూపానికి గురైంది. ముక్తేశ్వరస్వామి దేవాలయం వరద తాకిడికి చుట్టుప్రక్కల గ్రిల్స్ వరద ఉధృతికి ఎక్కడికక్కడ తెగిపోయాయి. ఆలయంలోని నవగ్రహాల గుడి పూర్తిగా ధ్వంసమైంది. చుట్టుప్రక్కల కోతకు గురికావటం, ఆలయంలో చుట్టుప్రక్కల వేసిన మార్బుల్స్ కొట్టుకుపోయాయి. ఆలయాల్లో ఆరడుగుల మేర వరదనీరు చేరి అంతా బురదమయంగా మారటంతో పాటు తలుపులు పగిలిపోయాయి. విషయం తెలుసుకున్న రెవెన్యూశాఖామంత్రి అనగాని సత్యప్రసాద్ ముక్తేశ్వరస్వామి దేవాలయాన్ని పరిశీలించారు. ఆలయ అర్చకుడు చావల సురేష్‌శర్మ గ్రామస్తులతో గుడికి జరిగిన నష్టాన్ని అడిగి తెలుసుకున్నారు. మంత్రి మాట్లాడుతూ ముక్తేశ్వరస్వామి దేవాలయానికి పూర్వవైభవం తెచ్చే విధంగా దేవదాయ శాఖ వారితో సంప్రదించి నిధులు మంజూరుచేసి మరమ్మతులు నిర్వహిస్తామని హామీనిచ్చారు.

ట్రాక్టర్‌పై లంక గ్రామాల్లో పర్యటించిన ఎమ్మెల్యే

- తమ గోడు వెళ్లబోసుకున్న బాధితులు



ట్రాక్టర్‌పై లంక గ్రామాల్లో పర్యటిస్తూ ప్రజలతో మాట్లాడుతున్న ఆనందబాబు

కొల్లూరు, సెప్టెంబరు 4 : ట్రాక్టర్‌పై వరద ప్రభావిత లంక గ్రామాల్లో ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు బుధవారం పర్యటించారు. వెల్లటూరు కరకట్ట నుంచి ట్రాక్టర్‌పై భట్టిప్రోలు మండలం పెదలంక, పెసర్లంక, చింతమోటు గ్రామాలను సందర్శించి అక్కడ దెబ్బతిన్న వాణిజ్య పంటలను పరిశీలించారు. అనంతరం ఆయా గ్రామాల్లోని బాధితులను పరామర్శించారు. ఆయన మాట్లాడుతూ వరద విపత్తులో కొల్లూరు, భట్టిప్రోలు మండలాల్లో నిరంతరం పర్యటిస్తూ ప్రజల క్షేమ సమాచారాన్ని ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ ఆహార పానీయాలు కూడా దగ్గరుండి ఆయా గ్రామాలకు పంపించడం జరిగిందన్నారు. విద్యుత్ సౌకర్యాన్ని కూడా గ్రామాలకు వెంటనే కల్పించాలని అధికారులను ఆదేశించామన్నారు. వరదల వల్ల దెబ్బతిన్న వాణిజ్య పంటలను కూడా అంచనా వేయించి రైతులకు నష్టపరిహారం అందించేందుకు చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. వరద వల్ల దెబ్బతిన్న గృహాలకు కూడా పరిహారం అందిస్తామని ఆయన వారికి భరోసా ఇచ్చారు. తొలుత పెసర్లంక, గాజుల్లంక గ్రామాల్లో పర్యటించి అక్కడ ప్రజలు, టీడీపీ నాయకులతో ప్రస్తుత పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. లంక గ్రామాల పర్యటనలో ఆయన వెంట, జనసేన జిల్లా అధ్యక్షుడు గాదె వెంకటేశ్వరరావు, నియోజకవర్గ కన్వీనర్ ఊసా రాజేష్, జిల్లా నాయకురాలు సోమరౌతు అనురాధ, బొందలపాటి చలమయ్య, మాజీ ఎంపీపీ డాక్టర్ కె.మధుసూదనప్రసాద్, ఎం.పుణ్యశ్రీనివాసరావు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

గ్రామాల్లో పారిశుధ్య పనులు ముమ్మరం

భట్టిప్రోలు, కొల్లూరు, సెప్టెంబరు 4 : వరద ప్రభావిత గ్రామాల్లో పారిశుధ్య పనులు జిల్లా పంచాయితీ అధికారి వి.రవికుమార్ ముమ్మరం చేశారు. బుధవారం కొల్లూరు పంచాయితీ కార్యాలయంలో కలెక్టర్ జె.వెంకటమురళి పారిశుధ్య కార్మికులతో సమావేశమయ్యారు. ఆయన ఆదేశాల మేరకు డిపివో, డిఎల్‌పివోలు ఒక్కో గ్రామానికి 15 మంది పారిశుధ్య కార్మికులను కేటాయించి వరద వల్ల పెరుకుపోయిన చెత్తాచెదారాలు, బురదను తొలగింపజేశారు. కార్యక్రమంలో డిఎల్‌పివో నరసింహారావు, కార్యదర్శి మల్లికార్జున పాల్గొన్నారు.

పునరావాస కేంద్రాల్లోని బాధితులకు దుప్పట్లు పంపిణీ



బాధితులకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ఆనందబాబు

భట్టిప్రోలు, కొల్లూరు, సెప్టెంబరు 4 : దాతలు అందించిన దుప్పట్లను పునరావాస కేంద్రాల్లోని బాధితులకు ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు పంపిణీ చేశారు. బుధవారం గుంటూరుకు చెందిన ప్రముఖ వైద్యులు రామతారకనాథ్ సతీమణి వైద్యులు శ్రీవిద్య అందించిన దుప్పట్లను దోనేపూడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రంలోని వరద బాధితులకు ఎమ్మెల్యే అందజేశారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో బాలామృతం, పాల ప్యాకెట్లను కూడా ఎమ్మెల్యే వారికి పంపిణీ చేశారు. వెల్లటూరులోని విశ్వశాంతి విద్యా సంస్థలో డాక్టర్ శ్రీవిద్య అందించిన దుప్పట్లను బాధితులకు అందజేశారు. ఆయా కార్యక్రమాల్లో ఐసీడీఎస్ పీడీ ఉమా, సీడీపీవో విజయలక్ష్మి, సూపర్‌వైజర్ నగరాజకుమారి, మాజీ ఎంపీపీ డాక్టర్ కనగాల మధుసూదన ప్రసాద్, జివిఎల్‌జి భగవాన్, వెనిగళ్ల మహేష్, నిమ్మగడ్డ అనీల్, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

నష్టపోయిన ప్రతి రైతుకు న్యాయం చేస్తాం : కలెక్టర్

రేపల్లె, సెప్టెంబరు 4 : తీరప్రాంతంలో వరద ఉధృతికి పంటలు నష్టపోయిన ప్రతి రైతుకు న్యాయం జరిగేలా అంచనాలు రూపొందించాలని కలెక్టర్ జే.వెంకటమురళి అన్నారు. పట్టణంలోని ప్రైవేటు కల్యాణ మండపంలో రేపల్లె సబ్‌డివిజన్‌కు సంబంధించిన గ్రామ వ్యవసాయ అసిస్టెంట్‌లు పంటనష్టపరిహారాన్ని అంచనాలు రూపొందించే శిక్షణా కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ నష్టపోయిన ప్రతి రైతుకు న్యాయం జరిగేలా చూడాలని విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్‌లకు సూచించారు. రైతులకు ఆర్థికంగా ఆదుకునే విధంగా తక్షణమే అంచనాలను నిష్పక్షపాతంగా వ్యవహరించాలని సూచించారు. బాపట్ల జిల్లా వ్యవసాయ సంచాలకులు వై.రామకృష్ణ మాట్లాడుతూ రేపల్లె సబ్‌డివిజన్ పరిధిలో వేలాది ఎకరాల వరి పంట నష్టం వాటిల్లిందని, తక్షణమే వీఏఏలు ప్రతి గ్రామం తిరుగుతూ నీట మునిగిన పొలాలను అంచనాలను రూపొందించాలన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయశాఖ ఏడీ విజయబాబు, అగ్రికల్చర్ అధికారులు ఏఈవోలు, ఎంపీఈవోలు, వీఏఈఏలు పాల్గొన్నారు.

మూగజీవాలకు ప్రాణహాని జరగకుండా చూడాలి : కలెక్టర్



పశుదాణా, ఔషధాలు పంపిణీలో పాల్గొన్న కలెక్టర్ వెంకటమురళి, ఎంపీ కృష్ణప్రసాద్, ఎమ్మెల్యే ఆనందబాబు

కొల్లూరు, సెప్టెంబరు 4 : మూగజీవాలకు ఎలాంటి ప్రాణహాని, నష్టం జరగకుండా అధికారులు చర్యలు చేపట్టాలని కలెక్టర్ వెంకటమురళి సూచించారు. కొల్లూరులో పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో బుధవారం పశుదాణా, ఔషధాల పంపిణీ కార్యక్రమంలో కలెక్టర్, ఎంపీ తెన్నేటి కృష్ణ ప్రసాద్, ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు పాల్గొన్నారు. దాణా, ఔషధాలు తీసుకు వచ్చిన వాహనాలకు కలెక్టర్ జెండా ఊపి లంక గ్రామాలకు సాగనంపారు. కలెక్టర్ మాట్లాడుతూ, పశువులకు ఎలాంటి వ్యాధులు రాకుండా ముందస్తుగా టీకాలు వేయాలన్నారు. జల దిగ్బంధంలో చిక్కుకున్న పశువులను కాపాడుకోవడానికి రూ.15 లక్షల విలువతో 95 మెట్రిక్ టన్నుల సంపూర్ణ మిశ్రమ దాణా పంపిణీ చేస్తున్నామన్నారు. పశువులకు అత్యవసర ఔషదాల నిమిత్తం రూ.2 లక్షలతో ఔషధాలను లంక గ్రామాలకు పంపుతున్నట్లు చెప్పారు. సకాలంలో పశు పోషకులకు దాణా అందజేయాలని ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్ అధికారులకు సూచించారు. కార్యక్రమంలో పశు సంవర్ధక శాఖ జేడీ డాక్టర్ హనుమంతరావు, పశు వైద్యాధికారులు పాల్గొన్నారు.

వేరుశనగ పైరు తొలగింపు



ఎంపీ రాజుపాలెంలో వేరుశనగ పైరు పీకుతున్న రైతులు

కర్లపాలెం, సెప్టెంబరు 4 : కర్లపాలెం పంచాయతీ పరిధిలో వేరుశనగ పైరును బుధవారం నుంచి తొలగిస్తున్నారు. భారీ వర్షాలకు వేరశనగ పైర్లలో నీళ్ళు నిలబడి వేరుశనగ కాయలు మొలకెత్తుతుండటంతో పంటకు నష్టం వాటిల్లుతుందని రైతాంగం అప్రమత్తమై వేరుశనగ పైరును పీకేస్తున్నారు. వచ్చినకాడికి పంటను దక్కించుకుందామనే ఉద్దేశ్యంతో అధిక ధరలు చెల్లించి వేరుశనగపైరును పీకిస్తున్నారు.



కాకినాడ తీరంలో ఉన్న మత్స్యకారులు

మత్స్యకారులు క్షేమం

రేపు గ్రామానికి రాక

ఎమ్మెల్యే ఏలూరికి కృతజ్ఞతలు తెలిపిన కుటుంబ సభ్యులు

చినగంజాం, సెప్టెంబరు 4 : జీవనోపాధి కోసం చేపల వేటకు వెళ్లి సముద్రంలో చిక్కుకున్న రుద్రమాంబపురం మత్స్యకారులతో పాటు మరో ఆరుగురు ఎట్టకేలకు కాకినాడ తీరానికి క్షేమంగా చేరుకున్నారు. మండలంలోని మోటుపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని రుద్రమాంబపురం గ్రామానికి చెందిన మత్స్యకారులు కొండూరి రాముడు, బసంగారి జయరాజు, కాటంగారి బాబూరావు, ఆవల మునియ్యతో పాటు మరో ఆరుగురు మత్స్యకారులు బతుకుదెరువు కోసం గత నెల 23వ తేదీన ఐఎన్‌డీ టీఎన్02 ఎంఎం 2210 నెంబరు గల మహాలక్ష్మీ ఐరన్ బోటులో చెన్నై నుంచి సముద్రంలో చేపల వేట చేసుకుంటూ విశాఖపట్నం తీరం వరకు వెళ్లారు. నాలుగు రోజుల కిందట విశాఖ తీరంలో 52 నాటికల్ మైళ్ల దూరంలో బోటు ఇంజన్ దెబ్బతినడంతో సముద్రం మధ్యలో బోటు ఆగిపోయింది. ఆ విషయాన్ని తోటి మత్స్యకారులు బోటు యజమానికి సమాచారం అందించారు. బోటు యజమాని ఈ విషయాన్ని మత్స్యకారుల కుటుంబసభ్యులకు తెలిపారు. మత్స్యకారులు సముద్రంలో చిక్కుకున్న విషయాన్ని రుద్రమాంబపురం గ్రామస్థులు, కుటుంబసభ్యులు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు దృష్టికి ఈ నెల 1వ తేదీన తీసుకెళ్లారు. ఎమ్మెల్యే ఏలూరి వెంటనే రెవెన్యూ, హోంమంత్రులు అనగాని సత్యప్రసాద్, వంగలపూడి వనిత దృష్టికి తీసుకెళ్లారు. మత్స్యకారులను సురక్షితంగా తీసుకొచ్చేలా చర్యలు తీసుకోవాలని కోరారు. తక్షణమే స్పందించిన మంత్రులు రెవెన్యూ, కోస్ట్ గార్డ్, కమాండ్ కంట్రోల్, మత్స్యశాఖ అధికారులకు సమాచారమిచ్చారు. రంగంలో దిగిన కోస్ట్‌గార్డ్స్ గాలింపు చర్యలు చేపట్టి సముద్రం మధ్యలో ఉన్న బోటును గుర్తించి, వెంటనే రెండవ రోజు బోటును మరమ్మతు చేయించి మంగళవారం అర్ధరాత్రికి కాకినాడ తీరానికి చేరేలా చేశారు. కాకినాడ తీరానికి చేరుకున్న మత్స్యకారులు ఎమ్మెల్యే ఏలూరి ఫోన్ చేసి కృతజ్ఞతలు తెపారు. క్షేమంగా మత్స్యకారులు కాకినాడ సముద్రతీరానికి చేరుకోవడంతో మత్స్యకారుల కుటుంబసభ్యులు ఆనందం వ్యక్తం చేశారు. తమ కుటుంబసభ్యులను సురక్షితంగా ఇళ్లకు చేర్చేందుకు కృషి చేసిన మంత్రులు వంగలపూడి అనిత, అనగాని సత్యప్రసాద్, ఎమ్మెల్యే ఏలూరికి కుటుంబసభ్యులు, గ్రామస్థులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. రుద్రమాంబపురం గ్రామానికి చెందిన నలుగురు మత్స్యకారులు కాకినాడ నుంచి బయలుదేరి గురువారం గ్రామానికి చేరుకుంటారని బంధువు ప్రళయకావేరి వెంకటేష్ బుధవారం తెలిపారు.

సీఐగా మల్లికార్జునరావు బాధ్యతలు



బాధ్యతలు స్వీకరిస్తున్న సీఐ మల్లికార్జునరావు

మేదరమెట్ల, సెప్టెంబరు 4 : అద్దంకి రూరల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా బుధవారం డి.మల్లికార్జునరావు బాధ్యతలు స్వీకరించారు. అద్దంకి రూరల్ సీఐగా పని చేస్తున్న శివరామకృష్ణారెడ్డి వీఆర్‌కు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో మల్లికార్జునరావు బాధ్యతలను స్వీకరించారు. కొరిశపాడు, జె.పంగులూరు, మేదరమెట్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో జాతీయ రహదారులలో ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు చేపడతామన్నారు. వాహనదారులు నిబంధనల మేరకు అన్ని పత్రాలను కలిగి ఉండాలన్నారు. మద్యం సేవించి వాహనాలు నడిపితే కఠినచర్యలు తీసుకుంటామన్నారు. శాంతి భద్రతలకు ఎవరూ విఘాతం కల్గిస్తే ఉపేక్షించమన్నారు.

రెండు రేషన్ దుకాణాలపై 6ఏ కేసు

ఇంకొల్లు, సెప్టెంబరు 4 : ఇంకొల్లులో రెండు రేషన్ దుకాణాలలో ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ అధికారులు ఆకస్మికంగా నిర్వహించారు. రెండు దుకాణాల నిర్వాహకులపై 6ఏ కేసు నమోదు చేశారు. 1వ నెంబర్ దుకాణంలో 33 క్వింటాళ్ల రేషన్ బియ్యం అదనంగా ఉన్నట్లు గుర్తించారు. 41వ నెంబర్ రేషన్‌దుకాణంలో 10 క్వింటాళ్ల బియ్యం అదనంగా ఉండడంతో అధికారులు 6ఏ కేసు నమోదు చేశారు. ఈ తనిఖీల్లో ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులతో పాటు వీఆర్వో సురేష్ ఉన్నారు.

ఆర్‌బీ చానల్‌లో గుర్రపుడెక్క తొలగింపు

ఎమ్మెల్యే ఏలూరి ఆదేశంతో చర్యలు చేపట్టిన ఇరిగేష్ అధికారులు

రైతుల హర్షం



ఆర్బీ చానల్‌లో తూటికాడను తొలగిస్తున్న సిబ్బంది

చినగంజాం, సెప్టెంబరు 4 : మండల పరిధిలోని రాజుబంగారుపాలెం కాలువలో పూడిక తీత, గుర్రపుడెక్క, తూటికాడ, చిల్ల చెట్ల తొలగింపు కార్యక్రమాన్ని బుధవారం చేపట్టారు. ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు సహకారంతో సంతరావూరు లాకుల వద్ద నుంచి కడవకుదురు శివారు వరకు రాజుబంగారుపాలెం కాలువలో(ఆర్‌బీ చానల్) యుద్ధప్రాతిపదికన పనులు చేపట్టారు. గత నాలుగు సంవత్సరాల నుంచి కాలువలో మరమ్మతులు చేయకపోవడంతో కాలవలో గుర్రపుడెక్క, తూటికాడ, మెరకలు ఏర్పడి పంట పొలాలకు సరిగా నీటి పారుదల లేక రైతులు పంటల సాగుకు ఇబ్బందులు పడ్డారు. ఇబ్బందులు పడుతున్న రైతుల పరిస్థితులను తెలుసుకొని ఎమ్మెల్యే ఏలూరి వెంటనే పనులు చేపట్టాలని ఇరిగేషన్ శాఖాధికారులను ఆదేశించారు. దీంతో నీటి పారుదల శాఖాధికారులు ఆర్‌బీ చానల్‌లో పూడికతీత పనులు, గుర్రపుడెక్క, తూటికాడ, చిల్ల చెట్లను తొలగిస్తున్నారు. పనులపై కడవకుదురు ప్రాంత రైతులు నక్కల వీరరాఘవులు, కేశన బాలయ్య, మదాసు ప్రసాద్, గేని వెంకటేశ్వర్లు, అనంత వెంకటేశ్వరరావు, తోటకూర శ్రీనివాసరావు, వెంకటరావు, ఎస్.శివన్నారాయణ తదితర రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఆర్టీసీ బస్సు డ్రైవర్‌పై దాడి

ముగ్గురు యువకులపై కేసు

మార్టూరు, సెప్టెంబరు 4 : ఆర్టీసీ బస్సులో డ్రైవర్‌పై చేయిచేసుకోవడంతోపాటు మహిళా కండక్టరు విధులకు ఆటంకం కలిగించిన ముగ్గురు యువకులపై బుధవారంరాత్రి స్టేషన్‌లో కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ మహమ్మద్ బాషా తెలిపారు. ఆయన తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఒంగోలు డిపోకు చెందిన పల్లెవెలుగు హయ్యర్ బస్సు గుంటూరు నుంచి ఒంగోలు వస్తుండగా మార్టూరు టౌన్‌లోకి వచ్చే క్రమంలో సర్వీసురోడ్ వద్ద బస్సు ముందు మార్టూరు గ్రామానికి చెందిన ముగ్గురు యువకులు బత్తినేని శ్రీనివాసరావు, గొర్రె వేణు, గజ్జల సాంబశివరావు రెండు ద్విచక్ర వాహనాలపై అడ్డదిడ్డంగా ప్రయాణిస్తున్నారు. డ్రైవరు గంటా రవికుమార్ బస్సు హారన్ మోగించారు. దీనిపై ఆగ్రహానికి గురైన ముగ్గురు యువకులు బస్సును ఆపి డ్రైవరుతో వాదన పెట్టుకొని చేయిచేసుకున్నాడు. అదే బస్సులో ప్రయాణిస్తున్న టంగుటూరు పోలీస్ స్టేషన్ హెడ్ కానిస్టేబుల్ బాదం సుబ్బారెడ్డితోపాటు మహిళా కండక్టరు దీవెనకుమారితో కూడా వాదనకు దిగారు. దీనిపై కండక్టరు ఫిర్యాదు మేరకు పోలీసులు ముగ్గురు యువకులను అదుపులోకి తీసుకొని వారిపై కేసు నమోదు చేశారు.

నేడు గురుపూజోత్సవం

ఒంగోలు(విద్య), సెప్టెంబరు 4: ఆచార్య సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకుని జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో గురుపూజోత్సవాన్ని గురువారం కలెక్టరేట్‌లోని ప్రజా సమస్యల పరిష్కార వేదికలో నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమానికి శాసనసభ్యుడు జనార్దన్ అధ్యక్షత వహిస్తారు. మంత్రి డాక్టర్ డీఎస్‌బీవీ స్వామి, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, మేయర్ గంగాడ సుజాతలు పాల్గొంటారు.

కదలం.. మెదలం..!

నగరంలో చీపురు పట్టే వారు కరువు

విజయవాడ వెళ్లిన 300 మంది శానిటరీ వర్కర్లు

కొందరు ఆర్డరు లేకుండా అటెండర్లుగా ఆఫీసులో తిష్ట

వారికి అధికారులు, వైసీపీ కార్పొరేటర్ల ఆశీస్సులు

ఎక్కడ చెత్త అక్కడే.. మెరుగుపడని పారిశుధ్యం

పూడుకుపోయిన డ్రైనేజీలు.. రోడ్లపైనే మురుగు

వర్షాలతో వెంటాడుతున్న వ్యాధుల భయం

పూర్తిస్థాయిలో విధుల్లో ఉంటేనే ప్రజారోగ్యానికి భరోసా

ఒంగోలు (కార్పొరేషన్), సెప్టెంబరు 4 : నగరంలో పారిశుధ్యం పడకేసింది. వర్షాల సీజన్‌లో సాధారణంగానే అస్తవ్యస్తంగా తయారవుతుంది. అయితే నగరపాలక సంస్థ యంత్రాంగం అప్రమత్తంగా ఉండి యుద్ధప్రాతిపదికన మెరుగైన చర్యలు చేపట్టాల్సి ఉంది. అయితే గత ప్రభుత్వ నీలి నీడలు ఇంకా కార్పొరేషన్‌ను వెంటాడుతూనే ఉన్నాయి. సిబ్బందిని ఇంకా ఆ జాడ్యం వీడలేదు. ఇటీవల భారీవర్షాల కారణంగా నీటమునిగిన విజయవాడలో సహాయక చర్యల కోసం ఒంగోలు నుంచి 300 మంది వరకు పారిశుధ్య కార్మికులు, మరో ముప్పై మంది శానిటరీ సెక్రటరీలు, మరికొందరు ఇన్‌స్పెక్టర్లు వెళ్లారు. అయితే ఉన్న అరకొర సిబ్బందిలో కొందరు అధికారుల ఇళ్లల్లో పనిచేస్తుండగా, మరికొందరు మేయర్ ఇంటిలో కార్మికులుగా కొనసాగుతున్నారు. దీంతో ప్రస్తుతం వీధులు ఊడ్చేవారు కరువయ్యారు. గత రెండు రోజులుగా నగరంలో చెత్త ఎత్తేవారు కనిపించకపోవడంతో కుప్పలు పేరుకుపోతున్నాయి. మరోవైపు కురుస్తున్న వర్షాల కారణంగా వ్యాధుల భయం వెంటాడుతోంది. మరోవైపు గత ప్రభుత్వ హయాంలో కార్మికులుగా చేరిన కొందరు కార్యాలయం నుంచి కాలు బయటపెట్టం అంటూ తిష్ట వేసి కూర్చుకున్నారు. ఇప్పటికైనా అధికారులు కార్యాలయంలో అవసరం లేకపోయినా అనధికారకంగా కొనసాగుతున్న పారిశుధ్య కార్మికులను తిరిగి పనిలోకి పంపితే తప్ప, నగరంలో కొంతమేర అయిన పారిశుధ్యం మెరుగుపడే పరిస్థితి కనిపించడం లేదు.

-ఒంగోలులో పారిశుధ్యం సరిగా లేదు. ఎవరు ఎక్కడ పనిచేస్తున్నారో తెలియదు.. ఇకపై నిర్లక్ష్యం వీడాలి. అప్రమత్తంగా ఉండాలి. వర్షాలు కురుస్తున్నాయి.. వ్యాధులు ప్రబలే అవకాశం ఉంది. అలసత్వం వీడి ప్రతిఒక్కరూ పనిచేయాలి. పారిశుధ్యం మెరుగుపరచాలి. ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలి. లేకుంటే చర్యలు తప్పవు

- బుధవారం కార్పొరేషన్ అధికారులతో నిర్వహించిన సమీక్షలో ఎమ్మెల్యే దామచర్ల

-పారిశుధ్యం మెరుగుకే మొదటి ప్రాధాన్యత. నగరం పరిశుభ్రంగా ఉంటేనే ప్రజలకు మంచి సేవలు అందించినట్లు. అప్పుడే అందమైన నగరంగా తీర్చిదిద్దవచ్చు. వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవడంతోపాటు డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరుస్తాం. కార్మికులందరూ పనిలో ఉండాల్సిందే.

-నగర కమిషనర్ వెంకటేశ్వరరావు ఇటీవల బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా మీడియాతో మాట్లాడారు.

నగరంలో చీపురు పట్టేవారు కరువయ్యారు. ఎక్కడి చెత్త అక్కడే ఉంటోంది. ఎటుచూసినా పరిస్థితి అధ్వానంగా మారింది. దీనికి తోడు వరద బాధిత ప్రాంతాల్లో యుద్ధప్రాతిపదికన పారిశుధ్యం మెరుగుకోసం 300 మందిపైనే కార్మికులను విజయవాడ పంపారు. పేరుకు కార్పొరేషన్ అయినా, హోదాకు అనుగుణంగా పనిచేసేవారు కరువయ్యారు. కార్మికులుగా చేరి, ఆ తర్వాత పెత్తనం చేయడానికి మేస్త్రీలుగా అవతారమెత్తారు. కొందరు వర్కర్లు పనిచేయకుండా ముఖం చాటేస్తూ, పలుకుబడితో కార్యాలయంలో ఆర్డర్ లేకుండానే అనధికారికంగా అటెండర్లుగా కొనసాగుతున్నారు. దీంతో నగరంలో పారిశుధ్య పరిస్థితి అగమ్యగోచరంగా మారింది.

రెండేళ్ళుగా కార్పొరేషన్ కార్యాలయంలో తిష్ట

బాలినేని శ్రీనివాసరెడ్డి ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో తన అనుచరుల కోసం ఇష్టారాజ్యంగా ఉద్యోగాలకు సిఫారసులు చేశారు. ఆప్కాస్ కింద 56మందికి ఉద్యోగాలు ఇచ్చారు. శానిటరీ, ఇంజనీరింగ్ విభాగాల్లో పనిచేస్తున్న వీరికి నెలనెలా రూ.21వేల వేతనం చెల్లిస్తున్నారు. మరోవైపు కొవిడ్ సిబ్బంది కింద మరో 100 మందికి పైగా ఉద్యోగాలు ఇవ్వగా వీరికి నెలకు రూ.18వేలు చెల్లిస్తున్నారు. అయితే వీరిలో ముప్పై మంది మాత్రం పనిలోకి వెళుతుండగా, మిగిలిన వారు మాత్రం నేటికి వైసీపీ కార్పొరేటర్ల అండదండలతో కార్యాలయం వదిలివెళ్లడం లేదు. ఇదిలా ఉంచితే వీరు కార్యాలయంలో కూడా చీపురు పట్టరు. ఫైళ్లు అందించరు. వారిని చూసి రెగ్యులర్ ఉద్యోగులు సైతం విస్తుపోతున్నారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో పారిశుధ్య కార్మికులుగా ఉద్యోగాలు పొందిన వారికి కార్పొరేషన్ నిధుల నుంచి టంచన్‌గా జీతాలు చెల్లిస్తున్నారు. కానీ టీడీపీ కూటమి ప్రభుత్వం వచ్చినా వీరిని మాత్రం కార్యాలయం నుంచి కదలించేవారు లేరని చెప్పుకుంటున్నారు. దీంతో నిత్యం పని చేసే వారిపైనే భారం పడుతోంది. ఇప్పటికైనా పారిశుధ్య విభాగంలో పూర్తిస్థాయిలో కార్మికులను విధుల్లోకి పంపితేనే నగరంలో పారిశుధ్యం మెరుగుపడదని నగరవాసులు అభిప్రాయపడుతున్నారు.

పూర్తిస్థాయిలో పారిశుధ్యం మెరుగుపడేనా?

ఒకవైపు నగరంలో పారిశుధ్య సమస్య వేధిస్తుండగా, అందుకు అనుగుణంగా కార్మికులు లేరు. వైసీపీ అండదండలతో పలు సెక్షన్లలో పెత్తనం చేస్తున్న 19మంది కార్మికులను తిరిగి చెత్త సేకరణకు పంపాలి. అలాగే ఆప్కాస్ కింద ఉద్యోగాలు పొంది, కార్యాలయానికి రాని వారిని తొలగించాల్సిన అవసరం ఎంతైన ఉంది. అకౌంట్ సెక్షన్‌లో ముగ్గురు ఉద్యోగులు ఉండగా, వారికి ఒకొక్కరికి ఒక్కో అటెండర్ ఉండటం చూస్తుంటే వైసీపీ కార్పొరేటర్ల పెత్తనం ఏస్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు.



నగరంలో పేరుకుపోయిన చెత్త

పనిచేసేవారు తక్కువ.. పెత్తనం చేసేవారు ఎక్కువ

ఒక్కో సెక్షన్‌లో కనీసం ముగ్గురు అటెండర్లు ఉండటం ఏ ప్రభుత్వ కార్యాలయంలో కనిపించని పరిస్థితి. అది ఒక్క ఒంగోలు కార్పొరేషన్ కార్యాలయంలోనే స్పష్టంగా కనిపిస్తుంది. గత వైసీపీ ప్రభుత్వ పాలనలో రాజకీయ పలుకుబడితో వర్కరుగా చేరిన కొందరు ఆ పార్టీ కార్యకర్తలు చీపురు పట్టుకోరు. ఇదిలా ఉంచితే కార్యాలయంలో కూడా వీరు చేసే పని పెద్దగా ఏమీ లేదని అధికారులే వెల్లడించడం విశేషం. వచ్చామా.. పోయామా.. అన్నట్లు ఉండటం ఇదీ అనధికార అటెండర్లు వ్యవహారశైలి. వీరి తీరుతో కార్పొరేషన్ కార్యాలయంలో పనిచేసేవారు తక్కువ, పెత్తనం చేసేవారు ఎక్కువ అనే పరిస్థితి నెలకొంది. కాగా గత వైసీపీ పాలనలో ఆడిందే ఆట పాడిందే పాటగా కొనసాగిన పారిశుధ్య కార్మికులు ప్రభుత్వం మారినా వీరి తీరు మాత్రం మారడం లేదు. వీరికి కార్యాలయంలోని కొందరు అధికారుల ఆశీస్సులతోపాటు, వైసీపీ కార్పొరేటర్ల అండదండలు పుష్కలంగానే ఉన్నాయి. అందుకే ఆర్డరు కాపీలు కూడా లేకుండా రెండేళ్లుగా వారిని కార్యాలయంలో కుర్చీ వేసి మరి మర్యాద చేసి నెలనెలా జీతాలు ఇస్తున్నారు.

వెంటాడుతున్న వైరల్ ఫీవర్స్

వర్షాకాలం అంటేనే వ్యాధుల భయం వెంటాడుతుంది. ఖాళీస్థలాలు, నీటి కుంటలలోకి నీరు చేరి జ్వరాలు ప్రబలుతాయి. దోమల వ్యాప్తికి అనుకూలమైన వాతావరణం కావడంతో డెంగ్యూ, మలేరియా తదితర విషజ్వరాలు ఇప్పటికే అధికమయ్యాయి. ఆస్పత్రులు జ్వరబాధితులతో కిటకిటలాడుతున్నాయి. ఇలాంటి సమయంలో డివిజన్లలో తిరిగి నీటినిల్వలు లేకుండా, ఇళ్ల మధ్య మురుగు కనిపించకుండా ఖాళీస్థలాల్లో చెత్తచెదారం లేకుండా చూడాలి. ఒంగోలు కార్పొరేషన్ పరిధిలో అలాంటి వాతావరణం కనిపించడం లేదు.

సిబ్బంది.. సామగ్రి

వరద సహాయక చర్యలకు జిల్లా నుంచి

విద్యుత్, పారిశుధ్య కార్మికుల తరలింపు

ప్రత్యక్షంగా బాధిత ప్రజలకు ఉపశమన

కార్యక్రమాల్లో మంత్రి డాక్టర్ స్వామి



విజయవాడలోని ముంపుప్రాంతాల్లో పర్యటిస్తున్న మంత్రి స్వామి

ఒంగోలు, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : వరద బారిన పడిన విజయవాడ ప్రజలకు తొలి రెండు రోజులు పెద్దఎత్తున భోజనం, మంచినీరు, ఇతర ఆహార పదార్థాలను విభిన్నవర్గాల వారు పంపించగా బుధవారం మనుషులను, యంత్రాలను పంపారు. ప్రస్తుతం అక్కడ సహాయక చర్యల కోసం ప్రభుత్వపరంగా అవసరమైన సిబ్బంది, ఇతర పరికరాలను పంపిస్తున్నారు. విజయవాడను ముంచెత్తిన ఇటు కృష్ణమ్మ అటు బుడమేరులు కాస్తంత శాంతించాయి. వరద ఉధృతి తగ్గడంతో అక్కడి ప్రజానీకం బయటకు వస్తున్నారు. అక్కడ ఆహారం కన్నా ఇతర సహాయక చర్యలు అవసరంగా అధికంగా ఉంది. ప్రధానంగా విజయవాడ నగరం అంతా మురుగు రోడ్లు, ఇళ్లను ఏకం చేసింది. వరదతో కొట్టుకొచ్చిన మట్టి, ఇసుక, ఇతర మురుగు నగరాన్ని ముంచెత్తింది. దీంతో వ్యాధులు ప్రబలే అవకాశం ఉంది మరోవైపు విద్యుత్ వ్యవస్థ పూర్తిగా దెబ్బతింది. ఈ నేపథ్యంలో అక్కడ తక్షణం పారిశుధ్య చర్యలు, విద్యుత్ సరఫరా పునరుద్ధరణ పనుల కోసం సంబంధిత సిబ్బంది, యంత్రాలు, ఇతర వస్తువులు భారీగా అవసరమయ్యాయి. దీంతో పొరుగు జిల్లాల నుంచి సిబ్బంది, మెటీరియల్‌ను పంపాలని ప్రభుత్వం ఆదేశించింది. తదనుగుణంగా జిల్లా నుంచి బుధవారం పారిశుధ్య కార్మికులు, విద్యుత్ సిబ్బంది, ట్రాక్టర్లు, జనరేటర్లు ఇతర సామగ్రిని తరలించారు. వరద సహాయక చర్యల కోసం ఒంగోలు కార్పొరేషన్ నుంచి మంగళవారం 150 మ ంది కార్మికులను పంపించారు. తిరిగి ఇక్కడి నుంచి మరో 150 మందిని పంపారు. అలాగే విద్యుత్ పునరుద్ధరణ పనుల కోసం 120 మందిని వివిధ స్థాయి అధికారులు, సిబ్బందిని ఇక్కడి విద్యుత్ శాఖ నుంచి పంపారు. మరో 50మందిని కూడా పంపించే ఏర్పాట్లు చేస్తున్నారు. అలాగే 125 కేవీ సామర్థ్యం ఉన్న రెండు జనరేటర్లను బుధవారం ఎస్ఈ సత్యనారాయణ పంపారు.

జిల్లా నుంచి ట్రాక్టర్లు

అలాగే అక్కడ సహాయక చర్యలు కోసం జిల్లా నుంచి 50 ట్రాక్టర్లను పంపాలని ప్రభుత్వం ఆదేశించడంతో యజమానులతో కలెక్టర్ తమీమ్ అన్సారియా మాట్లాడారు. తక్షణం 13 ట్రాక్టర్లను పంపారు. మిగిలిన వాటిని కూడా పంపనున్నట్లు తెలిపారు. సాంఘిక సంక్షేమ శాఖ అధికారుల విజ్ఞప్తి మేరకు నగరంలోని క్విస్, పేస్ ఇంజనీరింగ్ కళాశాలల యాజమాన్యం పదివేల పులిహోర పొట్లాలను విజయవాడ వరద బాధితులకు తరలించారు. స్థానిక లాయర్‌పేటలోని షిర్డిసాయి కల్చరల్ మిషన్ తరపున ఆహార పదార్థాలు, మంచినీటి బాటిళ్లను పంపారు. జిల్లాలోని పలు ప్రాంతాల వారు వరద బాధితుల సహాయార్థం ప్రభుత్వం ప్రకటించిన బ్యాంకు అకౌంట్లకు నగదు కూడా జమ చేస్తున్నారు. ఒంగోలు నుంచి ప్రభుత్వ ఆదేశాలతో కలెక్టర్ తమీమ్ అన్సారియా నేతృత్వంలో లక్షా 50వేల ఆహార పొట్లాలు, వాటర్ బాటిళ్ల, బ్రెడ్లు, బిస్కెట్ ప్యాకెట్లను ప్రత్యేక వాహనాల్లో పంపారు.

సహాయక చర్యలలో మంత్రి

ఇదిలా ఉండగా జిల్లాకు చెందిన సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డాక్టర్ డీఎస్‌బీవీ స్వామి విజయవాడలోని వరద బాధిత ప్రజల సహాయక చర్యలలో ప్రత్యక్షంగా పాల్గొంటున్నారు. అక్కడ నీట మునిగిన జక్కంపూడి, వైఎస్ కాలనీలకు ట్రాక్టర్‌లో వెళ్లి బాధితులను పరామర్శించారు. స్థానిక అధికారులు, సిబ్బందితో కలిసి సహాయక చర్యలను పర్యవేక్షించారు. ఆ సందర్భంగా ఒక అపార్ట్‌మెంట్‌లో చిక్కుకున్న ఇద్దరు చిన్నారులను ఎన్‌డీఆర్ఎఫ్ సిబ్బంది సాయంతో రక్షించే చర్యలు తీసుకున్నారు జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడుతో కలిసి ఆటోలో వెళ్లి బుడమేరుకు గండ్లుపడిన ప్రాంతాలను పరిశీలించారు.

రూ.6.72 కోట్లతో సొసైటీలు కంప్యూటరీకరణ

అక్టోబరు 2 నాటికి పూర్తికి ఆదేశం

ఒంగోలు(విద్య), సెప్టెంబరు 4 : గ్రామీణ ప్రాంతాల్లో రైతులకు వ్యవసాయ రుణాలు, ఎరువులు ఇతర ఉపకరణాలు అందించేందుకు ఏర్పాటు చేసిన ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల కంప్యూటరీకరణకు కేంద్రప్రభుత్వం శ్రీకారం చుట్టింది. సొసైటీల్లో అక్రమాలకు అవకాశం లేకుండా లావాదేవీలు పారదర్శకంగా నిర్వహించేందుకు సొసైటీల కంప్యూటరీకరణ దోహదం చేస్తుంది. జిల్లాలోని సహకార కేంద్ర బ్యాంకు(పీడీసీసీ) పరిధిలోని 172 సొసైటీలు కంప్యూటరీకరణ పనులు చేపట్టారు.

ఒక్కొక్క సొసైటీకి రూ.3.91 లక్షలతో మొత్తం రూ.6.72 కోట్లతో ఉమ్మడి ప్రకాశం జిల్లాలోని సొసైటీలను కంప్యూటరీకరణ ప్రక్రియ వేగంగా సాగుతుంది. అక్టోబరు 2 గాంధీ జయంతి నాటికి జిల్లాలో ఆ ప్రక్రియ పూర్తి చేయాలని ప్రభుత్వం ఆదేశించడంతో అందుకు అనుగుణంగా చర్యలు చేపట్టారు.

సొసైటీకి 3.91 లక్షలు

ఒక్కొక్క సొసైటీకి కంప్యూటరీకరణకు ప్రభుత్వం రూ.3.91లక్షలు వ్యయం చేస్తోంది. కంప్యూటర్, యూపీఎస్, వెబ్‌కామ్, బయోమెట్రిక్ స్కానర్, పాస్‌బుక్ ప్రింటర్, ఎలక్ట్రికల్ ఏర్పాట్లకు రూ.1.22 లక్షలు, డేటా నిర్వహణకు, సైబర్ సెక్యూరిటీకి రూ.72వేలు, కంప్యూటరీకరణపై సొసైటీ సిబ్బందికి శిక్షణకు రూ.10వేలు, డేటా ప్రిపరేషన్, డిజిటలైజేషన్, వెరిఫికేషన్‌కు రూ.1.10 లక్షలు, నిర్వహణ, హ్యాండ్లింగ్ సపోర్టుకు రూ.76వేలు వ్యయం చేయనున్నారు.

జగనన్న కాలనీల్లో అక్రమాలు

- నిబంధనలకు విరుద్ధంగా

స్థలాలు పొందిన వైసీపీ నాయకులు

- విక్రయించుకొని సొమ్ము చేసుకున్న వైనం

- ఒకే ప్లాటుపై ఇద్దరికి మంజూరు

- పోలీస్‌స్టేషన్‌ను ఆశ్రయించిన బాధితులు



రుద్రసముద్రంలో వివాదాస్పదమైన ఇళ్ల స్థలాల ప్లాట్లు

దొనకొండ, సెప్టెంబరు 4 : ఇళ్లు లేని పేదలందరికీ స్థలం ఇస్తామని గత వైసీపీ ప్రభుత్వం ఏర్పాటు చేసిన జగనన్న లేఅవుట్‌లలో అక్రమాలు చోటుచేసుకున్నాయి. ఇళ్ల పట్టాల పంపిణీలో ఆపార్టీకి చెందిన స్థానిక నాయకులు అధికారులను లోబర్చుకొని నిబంధనలకు విరుద్ధంగా పొజిషన్ సర్టిఫికెట్లు పొందారు. రెవెన్యూ అధికారుల సహకారంతో అక్రమ మార్గంలో ఇళ్ల స్థలాల ప్లాట్లు పొందిన వైసీపీ నాయకులు వాటిని విక్రయించుకొని సొమ్ము చేసుకున్నారు.

దొనకొండ సమీపంలోని ఇండ్లచెరువు గ్రామం మీదుగా మార్కాపురం వెళ్లే ప్రధాన రహదారి పక్కన 233/8 సర్వేనెంబర్‌లో దాదాపు 70 వరకు ఇళ్ల స్థలాల ప్లాట్లతో జగనన్న లేఅవుట్‌ను ఏర్పాటుచేశారు. నిబంధనలకు అనుగుణంగా ఆన్‌లైన్ విధానం ద్వారా సగం మంది లబ్ధిదారులకు ప్లాట్లు కేటాయించి ఇళ్లపట్టాలు మంజూరు చేసినట్లు సమాచారం. మిగిలిన ప్లాట్లు స్థానిక వైసీపీ నాయకులు నిబంధనలకు విరుద్ధంగా మాన్యువల్ పద్ధతిలో బినామీ పేర్లతో ఒక్కో నాయకుడు రెండేసి ప్లాట్లకు పొజిషియన్ సర్టిఫికెట్లు పొందినట్లు సమాచారం. అక్రమమార్గంలో ఇళ్ల పట్టాలు పొందిన వైసీపీ నాయకులు గుట్టుచప్పుడు కాకుండా ఒక్కో ప్లాటు రూ.75 వేల నుంచి రూ.లక్ష వరకు బహిరంగ మార్కెట్‌లో దర్జాగా విక్రయించుకొని సొమ్ము చేసుకున్నారని తెలుస్తోంది.

రుద్రసముద్రం గ్రామ సర్వేనెంబర్ 182లో దాదాపు 114 ప్లాట్లతో జగనన్న లేఅవుట్ ఏర్పాటుచేశారు. అందులో దాదాపు 95 మందికి పైగా అర్హులైన లబ్ధిదారులకు నిబంధనల మేరకు ఆన్‌లైన్ విధానంలో ఇళ్ల పట్టాలు ఇచ్చారు. మిగిలిన ప్లాట్లను స్థానిక వైసీపీ నాయకులు బదిలీపై వెళ్లిన రెవెన్యూ అధికారులపై ఒత్తిడి పెట్టించి అక్రమమార్గంలో మాన్యువల్ పద్ధతిలో ప్లాట్లకు పొజిషియన్ సర్టిఫికెట్లు పొందారు. అనంతరం బాధ్యతలు చేపట్టిన రెవెన్యూ అధికారులు ప్రజాప్రతినిధుల సిఫార్సు మేరకు ఇద్దరు ముగ్గురు అర్హులైన లబ్ధిదారులకు రికార్డు పరంగా ప్లాట్ నెంబర్లు వేసి ఇళ్ల స్థలాలకు పొజిషియన్ సర్టిఫికెట్లు మంజూరు చేశారు. వారికి కేటాయించిన ప్లాట్లలో ఇళ్ల నిర్మాణం చేపట్టబోగా అదే ప్లాట్ నెంబర్లతో పొజిషియన్ సర్టిఫికెట్లు పొందిన వైసీపీ నాయకులు వారిపై దౌర్జన్యం చేసి నిర్మాణం చేపట్టకుండా అడ్డగించారు. దీంతో బాధితులు పోలీస్‌స్టేషన్‌ను ఆశ్రయించారు. పోలీసులు విచారించి ఇద్దరి వద్ద ఉన్న ఇళ్ల ప్లాట్ల పొజిషన్ సర్టిఫికెట్లలో ఏది నకిలీ, ఏది ఒరిజనల్ ధ్రువీకరించాలంటూ తహసీల్దార్ కార్యాలయానికి పంపారు. సమస్య పరిష్కారం నిమిత్తం బాధితులు నెలల తరబడి తహసీల్దార్ కార్యాలయం చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నా నేటికీ ఎటువంటి ఫలితం లేదు. ఇన్ని అక్రమాలు జరుగుతున్నా రెవెన్యూ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ చోద్యం చూస్తున్నారని ఆరోపణలు వస్తున్నాయి. అధికారులు విచారణ చేపట్టి అక్రమమార్గంలో పొందిన పట్టాలను రద్దుచేసి అర్హులైన లబ్ధిదారులకు న్యాయం చేయాలని ప్రజలు కోరుతున్నారు.

వరద బాధితులకు అండగా

- ఏలూరి పిలుపుతో ముందుకొస్తున్న దాతలు
- కొనసాగుతున్న ఆహార ప్యాకెట్ల తరలింపు
- చీరలు, నగదు సాయం

బల్లికురవ, సెప్టెంబరు 4 : జిల్లా ఉన్నతాధికారులు, విద్యుత్ మంత్రి గొట్టిపాటి సూచనల మేరకు మంగళవారం బల్లికురవ, సంతమాగులూరు మండల ప్రజా పరిషత్ కార్యాలయాల ద్వారా వరద బాధితులకు ఆరు వేల అహార పొట్లాలను వాహనాల ద్వారా విజయవాడకు పంపించారు. బల్లికురవ ఇన్‌చార్జి ఎంపీడీవో రాంబాబు, సంతమాగులూరు ఈవోపీఆర్డీ ప్రసాదరావు పర్యవేక్షణలో ఆరు వేల అహార పొట్లాలను తయారు చేయించి ప్యాకింగ్‌తో విజయవాడుకు పంపించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజలు ఎవరైన వరద బాధితులను ఆదుకునేందుకు ముందుకు రావచ్చు అని కోరారు. ముఖ్యమంత్రి సహాయ నిధికి విరాళాలు సమర్పించాలని వారు కోరారు.

ఆర్య వైశ్యుల సాయం



ఆహారాన్ని తీసుకువెళ్తున్న మార్టూరు ఆర్య వైశ్యులు

విజయవాడలోని వరద బాధితులకు ఆదుకునేందుకు మార్టూరులో వ్యాపారాలు చేసుకుంటున్న ఆర్య వైశ్యులు బుధవారం సాయం అందించారు. వరద బాధితులకు ఆహార పొట్లాలను అందించేందుకు ఆర్యవైశ్య కల్యాణ మండపంలో 2500 ఆహార పొట్లాలను తయారు చేయించారు. వాటికి తోడు 3వేల వాటర్ బాటిళ్లను, బిస్కట్లు, చీరలను వాహనాలలో విజయవాడకు తరలించి బాధితులకు స్వయంగా అందజేశారు. ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు సూచన మేరకు ఆర్య వైశ్యులు సహాయాన్ని అందించారు. కార్యక్రమంలో గుర్రం శ్రీను, మద్దు నాని, కనమర్లపూడి ఆంజనేయులు,, గట్టా యానాదిరావు, మామిడిపాక హరిప్రసాద్, కనమర్లపూడి శివయ్య, శ్రీరాం రవిశంకర్,ఆత్మకూరి పవన్ కల్యాణ్ పాల్గొన్నారు.



బల్లికురవ, సంతమాగులూరు నుంచి వరద బాధితులకు తరలిస్తున్న ఆహార పొట్లాలు

రూ.50వేల సాయం

యద్దనపూడి, (మార్టూరు) సెప్టెంబరు 4 : యద్దనపూడి మండలంలోని పూనూరు గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ కూటమి నాయకులు వరద బాధితులకు అండగా తమ వంతు సాయంగా బుధవారం రూ.50వేలను వసూలు చేశారు. ఈ మొత్తాన్ని వారు వరద బాధితులకు అందిస్తామన్నారు. ఏలూరి సాంబశివరావు సూచన మేకు సహాయ సహకారాలను అందిస్తామని నాయకులు తెలిపారు.

బాబున్నారు..అధైర్య పడొద్దు

ఎమ్మెల్యే కొండయ్య



విజయవాడ శివారు ప్రాంతంలో పర్యటిస్తున్న ఎమ్మెల్యే కొండయ్య

చీరాల, సెప్టెంబరు 4 : ముఖ్యమంత్రి చంద్రబాబు అండగా ఉన్నారని, ఎవరూ అధైర్యపడవద్దని విజయవాడ వరద బాధితులకు ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య భరోసా కల్పించారు. రెండు రోజులుగా ముఖ్యులతో కలసి విజయవాడ లోతట్టు ముంపు ప్రాంతాల్లో కొండయ్య పర్యటిస్తున్నారు. భోజనం ప్యాకెట్లు, పాలప్యాకెట్లు, మంచి నీళ్ల బాటిళ్లను దగ్గరుండి పంపిణీ చేయిస్తున్నారు. బాధితులను ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకుంటుంటే వైసీపీ నేతలు అసత్య ప్రచారాలు చేయడాన్ని ప్రజలు ఈసడించు కుంటున్నారని అన్నారు. అనంతరం స్థానికులతో ఆయన మాట్లాడారు. ఆయన వెంట పలువురు టీడీపీ నాయకులు ఉన్నారు.

మంత్రి గొట్టిపాటి సహకారంతో తరలివెళ్తున్న ఆహారం

- 7వేల లీటర్ల పాలు, 20వేల వాటర్‌బాటిళ్లు
- నేడు కూడా పంపిణీ



పాలప్యాకెట్లను పంపిణీ చేస్తున్నశ్రేణులు

అద్దంకి, సెప్టెంబరు 4 : వరద బాధితుల కోసం అద్దంకి నుంచి మంత్రి గొట్టిపాటి రవికుమార్ సహకారంతో విజయవాడకు బుధవారం 7వేల లీటర్ల పాలు, 20వేల వాటర్‌బాటిళ్లను తీసుకెళ్లి పంపిణీ చేశారు. సోమ, మంగళవారాల్లో ఇక్కడ తయారు చేయించి 65వేల మందికి భోజనాలు, వాటర్ బాటిళ్లను పంపించారు. బుధవారం 7వేల లీటర్ల పాలు, 20వేల వాటర్ బాటిళ్లను విజయవాడలోని రాజేశ్వరపేటకు పంపించారు. గురువారం కూడా 50వేల పాలప్యాకెట్‌లు పంపిణీ చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. విజయవాడ లో ఎక్కువ మంది పాలప్యాకెట్‌లు అవసరం కావడంతో మంత్రి రవికుమార్ అద్దంకి నుంచి పంపిస్తున్నారు.

బాధితులకు బ్రెడ్లు, పాల ప్యాకెట్లు

స్వయంగా అందజేసిన టీడీపీ కార్యకర్త



వాహనాన్ని పంపిస్తున్న కార్యకర్త శంకరరావు

విజయవాడలో వరద బాధితుల బాధితుల కోసం చంద్రబాబు పడుతున్న కష్టాన్ని టీవీలో చూసి చలించిన అద్దంకి పట్టణానికి చెందిన టీడీపీ కార్యకర్త కురిచేటి శంకరరావు సుమారు 60వేల రూపాయలతో బ్రెడ్, పాలప్యాకెట్‌లు, వాటర్‌బాటిళ్లను బుధవారం అద్దంకిలో కొనుగోలు చేసి ప్రత్యేక వాహనంలో విజయవాడకు తీసుకు వెళ్లారు. తానే స్వయంగా ట్రాలీ ఆటోలో వెళ్లి విజయవాడలోని భవానిపురం, సితార సెంటర్, కబేరా సెంటర్, జక్కంపూడి సెంటర్ లలో బాధితులకు అందజేశారు. కౌన్సిలర్ అత్తులూరి రమేష్ ఆయనవెంట ఉన్నారు.

ఏలూరి పర్యవేక్షణలో ఆహారం పంపిణీ

మార్టూరు : విజయవాడలోని వరద బాధితులకు కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందని, ఎవరూ అధైర్యపడవద్దని, ప్రజల క్షేమమే బాధ్యతగా ముఖ్యమంత్రి చంద్రబాబు పనిచేస్తున్నారని ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు బుధవారం ప్రకటనలో తెలిపారు. ఏలూరి రెండోరోజూ విజయవాడలో హోంమంత్రి వంగలపూడి అనితతో కలిసి ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు బాధితులను పరామర్శించారు. వరదబాధితుల వద్దకు వెళ్లి పరామర్శిస్తున్నారు. ఆయన విజ్ఞప్తి మేరకు నియోజకవర్గం నుంచి తరలివెళ్తున్న ఆహార పొట్లాలను, మంచినీరు, పాల ప్యాకెట్లను ఆయన దగ్గరుండి బాధితులకు అందేలా చూస్తున్నారు. సీతారాంనగర్, విద్యాధరపురంలో ఏలూరి పర్యటిస్తున్నారు. మరోవక్క ఏలూరి పిలుపుతో పర్చూరు వాణిజ్య విభాగం, ఆర్య వైశ్య సంఘం వారు పెద్ద ఎత్తున వరద బాధితులకు ఆహారం, దుస్తులను సమకూర్చి తరలిస్తున్నారు. దేవరపల్లికి చెందిన కొమ్మాలపాటి సురేష్ రూ.50వేల విలువైన ఆహారాన్ని పంపించారు. యద్దనపూడి మండలం పూనూరు గ్రామానికి చెందిన నాయకులు ఆహార పొట్లాలను, జాగర్లమూడికి చెందిన పార్టీ నేతలు హనుమయ్య లక్షా10 వేలు, దూళ్లిపాళ్ల వెంకటస్వామి రూ.లక్ష విలువైన ఆహారం, వాటర్ బాటిళ్లను విజయవాడకు పంపించారు.



బాధితులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఏలూరి

మణికేశ్వరం గ్రామాన్ని సందర్శించిన వైద్యులు, అధికారులు

- జ్వరాలపై ఇంటింటి సర్వే
- జోరుగా పారిశుధ్య కార్యక్రమాలు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

అద్దంకిటౌన్, సెప్టెంబరు 4 : మణికేశ్వరం గ్రామాన్ని బుధవారం ఎంపీడీవో దేవ సేన కుమారి, వైద్యాధికారులు డాక్టర్ మనోజ్, డాక్టర్ హరికృష్ణ తమ సిబ్బంతో కలిసి ఇంటింటి సర్వే నిర్వహించారు. బుధవారం గ్రామంలో విష జ్వరాలపై ఆంధ్రజ్యోతిలో వచ్చిన కథనానికి స్పందించిన అధికారులు, వైద్యులు గ్రామంలోకి వెళ్లి జ్వరాలతో బాధ పడుతున్న వారిని ఇంటింటి సర్వే ద్వారా గుర్తించారు. ఎంపీడీవో దేవసేన కుమారి గ్రామంలో పర్యటించి జ్వరాలపై వివరాలను అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో విషజ్వరాలు ప్రబలకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. గ్రామంలో పారిశుధ్యం పనులు చేట్టాలని, మురుగునీటి నిల్వలు లేకుండా, దోమలు వ్యాప్తి కాకుండా తగు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రజలు జ్వరాలపై అ వగాహన కలిగి ఉండి ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని ఆమె తెలిపారు. గత వారంరోజుల కిందట గ్రామంలో జ్వర పీడితులను సర్వే చేసి, మందులు అందించడం జరిగిందని వైద్యులు తెలిపారు. ప్రస్తుతం గ్రామంలో 46 మందికి జ్వరాలు ఉండగా , వారిలో కొందరికి జ్వరం తగ్గి, ఒళ్ల నొప్పులతో బాధపడుతున్నారని, మరికొంతమంది ఇతర సమస్యలతో బాధపడుతున్నారని తెలిపారు. ప్రధానంగా చికున్ గున్యా, టైఫాయిడ్ జ్వరాలుగా తెలిపారు. గురువారం గ్రామంలో మరోసారి వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేయనున్నట్లు వైద్యులు తెలిపారు. ప్రజలు గమనించి మెరుగైన వైద్య సౌకర్యాలున్న ప్రభుత్వ వైద్యశాలలను ఉపయోగించుకోవాలన్నారు.



ఇంటింటి సర్వే చేస్తున్న వైద్యాధికారులు, సిబ్బంది

కత్తెర పురుగు నివారణకు చర్యలు తీసుకోండి

మేదరమెట్ల, సెప్టెంబరు 4 : మొక్కజొన్న పైరుకు ఆశిస్తున్న కత్తెర పురుగు ఉధృతం కాకుండా సస్యరక్షణ చర్యలు చేపట్టాలని అద్దంకి ఏడీఏ కె. ధన్‌రాజ్ తెలిపారు. బుధవారం మేదరమెట్లలో మొక్కజొన్న, కంది, మినుము పైర్లను వ్యవసాయ అధికారి శ్రీనివాసరావుతో కలిసి ఆయన పరిశీలించారు. మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలతో లేత పంటలలో పోషక లోపాలు రాకుండా మల్టి-కె, లేదా పొటాషియం నైట్రేట్‌ను వారం తేడాతో రెండు సార్లు పిచికారీ చేసుకుంటే లోపాలను నివారించుకోవచ్చు అన్నారు. మొక్కజొన్నలో కత్తెర పురుగును నివారించుకోవడానికి కార్బోఫ్యూరాన్ 3జీ గుళికలను ఆకుల మోములలో వేయాలన్నారు. ఇమ్మాక్టిన్ బెంజోఎయిట్‌ను పిచికారీ చేయాలని సూచించారు. కార్యక్రమంలో వీఏఏ శ్రీకీర్తి, హసీనా, సంతోష్, రైతులు పాల్గొన్నారు.



మొక్కజొన్నను పరిశీలిస్తున్న ఏడీఏ ధన్‌రాజ్

టిడ్కో ఇళ్ల వద్ద సబ్‌స్టేషన్ ఏర్పాటు పనులు ప్రారంభం

అద్దంకి, ఆగస్టు 4 : శింగరకొండ సమీపంలోని టిడ్కో గృహ సముదాయాల వద్ద సబ్ స్టేషన్ ఏర్పాటుకు బుధవారం పనులను ప్రారంభించారు. ఈఈ నల్లూరి మస్తాన్‌రావు ఆధ్వర్యంలో సబ్‌స్టేషన్ ఏర్పాటు చేసే ప్రాంతంలో జంగిల్ క్లియరెన్స్ చేయించి మార్కింగ్ ఇచ్చారు. సబ్‌స్టేషన్ పనులు వేగవంతంగా పూర్తిచేయటం జరుగుతుందని ఈఈ మస్తాన్‌రావు తెలిపారు. టెక్నికల్ ఎఈ బాలకోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



పరిశీలిస్తున్న విద్యుత్ శాఖ ఈఈ నల్లూరి మస్తాన్‌రావు

జ్వరాలు రాకుండా జాగ్రత్తగా ఉండండి

అద్దంకిటౌన్, సెప్టెంబరు 4 : సీజనల్‌గా వచ్చే విష జ్వరాలు రాకుండా ప్రజలు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని గాజులపాలెం యూపీహెచ్‌పీ వైద్యుడు డాక్టర్ గొట్టిపాటి జయసింహ తెలిపారు. బుధవారం అద్దంకి పట్టణంలోని రాజీవ్‌కాలనీలో సచివాలయం వద్ద జ్వరం పీడితుల కోసం వైద్య శిబిరాన్ని నిర్వహించారు. జ్వరంతో బాధపడుతున్న వారిని ఆరోగ్య కార్యకర్తలతో ఇంటింటి సర్వే ద్వారా గుర్తించారు. వారిని పరీక్షించి మందులను అందజేశారు. ఎటువంటి ఇబ్బంది కలిగినా వెంటనే ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చి చికిత్స తీసుకోవాలని, అక్కడ అన్ని రకాలు పరీక్షలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. మురుగు నీరు నిల్వలు లేకుండా చేసుకోవాలన్నారు. మొత్తం 30 మంది రోగులను పరీక్షించి మందులు అందజేసినట్లు డాక్టర్ జయసింహ తెలిపారు. కార్యక్రమంలో వైద్య, ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు.



రోగులను పరీక్షిస్తున్న డాక్టర్ జయసింహ

శ్రీనన్నోరమ్మకు ప్రత్యేక పూజలు

పర్చూరు, సెప్టెంబరు 4 : పర్చూరు మండలం ఉప్పుటూరు గ్రామంలో ఉన్న శ్రీనన్నోరమ్మ అమ్మవారికి బుధవారం ప్రత్యేక పూజలు చేశారు. నల్లగొర అమ్మవారి ఆడపడుచుగా భక్తులు కొలుస్తారు. కార్యక్రమంలో భాగంగా అమ్మ వారికి ఆడపడుచుగా నల్లగొర్ల కుటుంబీకులు పర్చూరు నియోజకవర్గ కాంగ్రెస్‌పార్టీ ఇన్‌చార్జి నల్లగొర్ల శివ శ్రీలక్ష్మి జ్యోతి సారెను సమర్పించి భక్తిని చాటుకున్నారు.అనంతరం ప్రసాదాలు పంపిణీచేశారు. కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



పౌష్టిక ఆహార పదార్థాలను చూపిస్తున్న అంగన్‌వాడీలు

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం

చినగంజాం, సెప్టెంబరు 4 : పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం చేకూరుతుందని ఇంకొల్లు సెక్టార్ సీడీపీవో టీ.ఝాన్సీ అన్నారు. మండలంలోని పెద గంజాం గ్రామం ఎస్సీ కాలనీలోని అంగన్‌వాడీ కేంద్రంలో పౌష్టికాహార మాసోత్సవాలలో భాగంగా బుధవారం పోషకాహారంపై బాలింతలకు, గర్భిణులకు జరిగిన అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. పోషక విలువలు కలిగిన ఆహార పదార్థాలను తీసుకోవడం ద్వారా వ్యాధి నిరోధిక శక్తి కలిగి ఆరోగ్యంగా, ఆర్థికంగా ఉంటారని సీడీపీవో సూచించారు. ప్రతి ఒక్కరూ సమతుల ఆహారం తీసుకోవాలన్నారు. పోషక విలువలు కలిగిన ఆహార పదార్థాలను అంగన్‌వాడీ కార్యకర్తలు తయారు చేసి వాటిని ప్రదర్శించారు. పోషక విలువలు కలిగిన ఆహార పదార్థాల వలన కలిగే ప్రయోజనాలను బాలింతలకు, గర్భిణీ స్త్రీలకు వారు వివరించారు. బాలామృతం ప్యాకెట్లను సీడీపీవో తల్లులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పెదగంజాం సెక్టార్ సూపర్‌వైజర్ కే.వాణిశ్రీ, అంగన్‌వాడీ కార్యకర్తలు జయలక్ష్మీ, విజయలక్ష్మీ, కవిత, బేబి, పద్మ, మల్లేశ్వరి, సౌభాగ్యం, శివనాగేశ్వరి, ఆయాలు, ఏఎన్ఎం నాగుల కోటేశ్వరి, గర్భిణిలు, బాలింతలు పాల్గొన్నారు.

చీరాలటౌన్ : గర్భిణులు, బాలింతలు ఆహార నియమాలను క్రమంగా పాటించడం వలన సంపూర్ణ ఆరోగ్యంగా జీవిస్తారని అర్బన్ ఏసీడీపీవో సుచిత్ర అన్నారు. పురపాలక పరిధిలోని ఉజిలీపేట అర్బన్ అంగన్వాడీ కేంద్రంలో పౌష్టికాహార మాసోత్సవం(పోషణ మాహ్) కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఏ ఆహారంలో పౌష్టికత లభిస్తోందో వివరించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ కుముద్వతి, ఏఎన్ఎం కల్యాణి, అంగన్వాడీ కార్యకర్త కళావతి, బాలింతలు, గర్భిణులు పాల్గొన్నారు.

హోమియో మందుల పంపిణీ



హోమియో మాత్రలను పంపిణీ చేస్తున్న సభ్యులు

అద్దంకిటౌన్, సెప్టెంబరు 4 : ప్రజలు సీజనల్‌గా వచ్చే వ్యాధులపై అవగాహన కలిగి తగు జాగ్రత్తలు తీసుకోవాలని డిపో మేనేజర్ బీ రామ్‌మోహనరావు అన్నారు. రోటరీ క్లబ్ ఆఫ్ శింగరకొండ ఆధ్వర్యంలో బుధవారం డెంగ్యూ, విష జ్వరాలు రాకుండా ముందస్తు జాగ్రత్తగా వేసుకునేందు ఆర్టీసీ బస్టాండ్‌లో ప్రయాణికులకు హోమియో మాత్రలను ఆయన పంపిణీ చేశారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ అధ్యక్షుడు చప్పిడి వీరయ్య, హోమియో డాక్టర్ కావూరి రఘుచంద్, రోటరీ కార్యదర్శి మురళీసుధాకరరావు, ట్రెజరర్ శ్రీనివాసరావు, దేవపాలన, చంద్రమౌళి, శ్రీరామచంద్రమూర్తి, ఆంజనేయులు, రామకోటేశ్వరరావు, భువనేశ్వరి, త్రిమూర్తులు, కోటయ్య, నాగయ్య పాల్గొన్నారు.

వ్యక్తిత్వ వికాసంపై అవగాహన

చీరాల, సెప్టెంబరు 4 : వైఏ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో బుధవారం వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో రామచంద్రమిషన్ హార్ట్‌ఫుల్‌నెస్ మెడిటేషన్ కోఆర్డినేటర్ శ్రీకాంత్ విద్యార్థినులకు వ్యక్తిత్వ వికాసంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా క్లబ్ అధ్యక్షుడు వల్లంపట్ల వెంకటేశ్వరరావు మాట్లాడుతూ వాసవీ క్లబ్ ఇంటర్నేషనల్ వారి ఆదేశాల మేరకు కేసీ గుప్తా జయంతి వారోత్సవాల్లో భాగంగా ఈ కార్యక్రమం నిర్వహించినట్లు చెప్పారు. విద్యార్థినుల సందేహాలను నివృత్తి చేశారు. అనంతరం ప్రసంగీకులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో క్లబ్ ప్రతినిధులు వీబీవీ సత్యనారాయణ, సాతులూరి బాలాజీ రామకృష్ణ, మువ్వల వేణుగోపాల్, తూతిక మల్లికార్జునరావు, పోలిశెట్టి శ్యాంసుందర్ పాల్గొన్నారు.

15 వరకు ఈకేవైసీ గడువు

పంగులూరు, సెప్టెంబరు 4 : ఖరీఫ్‌లో రైతులు సాగు చేసిన పంటల వివరాలను ఈ నెల 15వ తేదీలోగా ఈకేవైసీని చేయించుకోవాలని వ్యవసాయాధికారి సుబ్బారెడ్డి తెలిపారు. బుధవారం ఏవో సుబ్బారెడ్డి మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా పంటల బీమా పథకాన్ని అమలు చేస్తున్నాయన్నారు. వర్షాభావ పరిస్థితుల్లో పంట నష్టం వాటిల్లిన రైతులకు ఈ పథకం ఆసరాగా నిలుస్తుందన్నారు. పంటల బీమా పొందేందుకు రైతులు తమ పంటలకు తప్పనిసరిగా ఈకేవైసీని చేయించుకోవాలని సూచించారు. ఈ నెల 15లోగా ఈకేవైసీని చేయించకపోతే బీమా వర్తించదని తెలిపారు. వ్యవసాయ సిబ్బంది పంట సాగవుతున్న పొలాలకు వెళ్లి ఈకేవైసీని చేస్తారని, రైతులు సంబంధిత పత్రాలు, ఆధార్ కార్డు, మొబైల్ నెంబర్‌తో సిద్ధంగా ఉండాలన్నారు. సాగు భూమివద్ద రైతులతో ఫొటో తీసుకుని వారి వేలిముద్రతో ఈకేవైసీని పూర్తి చేస్తారని తెలిపారు. నిర్ణీత గడువులోగా సంబంధిత రైతులు ఈకేవైసీని పూర్తి చేయించుకోవాలని ఏవో కోరారు.

విజయవాడకు పారిశుధ్య కార్మికులు

ఇంకొల్లు, సెప్టెంబరు 4 : ఇంకొల్లు నుంచి పారిశుధ్య కార్మికులు బుధవారం బాపట్ల జిల్లా కొల్లూరు మండల ప్రాంత వరద బాధిత ప్రాంతానికి బయలుదేరి వెళ్లారు. అక్కడ పారిశుధ్య పనుల్లో భాగస్వామ్యం అయ్యేందుకు కార్యదర్శి కోటి నాగయ్య ఆధ్వర్యంలో పలువురు కార్మికులు తరలి వెళ్లారు. అక్కడ పరిస్థితి అదుపులోకి వచ్చే వరకూ పనులు చేస్తారని తెలిపారు.

ఉపాధ్యాయుల కృషితో సమాజం ముందుకు

అద్దంకిటౌన్, సెప్టెంబరు 4 : ఉపాధ్యాయుల కృషి సమాజాన్ని ముందుకు నడిపించేందుకు ఎంతగానో తోడ్పడుతుందని, ఉపాధ్యాయుల సేవలను గుర్తించి వారికి ప్రోత్సహించడం అభినందనీయమని ఎంఈవో గంగాధరరావు అన్నారు. గురుపూజోత్సవాన్ని పురస్కరించుకొని ముందస్తుగా బుధవారం మారం వారి సేవాసదన్‌లో పుట్టంరాజు బుల్లెయ్య, రామలక్ష్మమ్మ ట్రస్ట్ ఆధ్వర్యంలో మండలంలోని విద్యారంగంలో విశేష కృషి చేస్తున్న పలువురు ఉపాధ్యాయులకు పురస్కారాలను ప్రదానం చేశారు. వారణాసి రఘురామశర్మ అధ్యక్షతన జరిగిన ఈ సన్మాన కార్యక్రమంలో ఉపాధ్యాయులు కోవి మల్లికార్జునరావు, పాములపాటి రాజశేఖర్, శానంపూడి నాగమల్లిక, మానికొండ ధనలక్ష్మిని ట్రస్ట్ అధ్యక్షుడు పుట్టంరాజు శ్రీరామచంద్రమూర్తి, శైలజ దంపతులు పురస్కారాలను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా సమాజంలో ఉపాధ్యాయుల ప్రాతను పలువురు వర్ణించారు. కార్యక్రమంలో చప్పిడి వీరయ్య లక్కరాజు శ్రీనివాసరావు, చుండూరి మురళీసుధాకరరావు, డాక్టర్ యూ దేవపాలన, చంద్రశేఖర్, డీవీఎం సత్యనారాయణ, వెంకట్రావు, మహమ్మద్ రఫీ, శ్రీనివాసరావు, రాజశేఖర్, పోలిరెడ్డి, శి వరామ కోటేశ్వరరావు, కుమార్, వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. ఏపీటీఎఫ్ నాయకులు పాల్గొన్ని ఉపాధ్యాయులను సన్మానించారు.



ఉపాధ్యాయులను సన్మానిస్తున్న ట్రస్ట్ సభ్యులు